VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దిన పత్రిక
హైదరాబాద్
శనివారం 16.05.2026
సంపుటి: 07 సంచిక: 342
పేజీలు: 12 వెల: రూ. 5/
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA I ANDHRA PRADESH
Velthuru Newspaper



## స్టార్ హోటళ్లలోనూ కల్లు, నీరా అందుబాటులోకి తెస్తాం: పొన్నం
2



## మోదీ మార్కు వసూళ్లు షురూ

- ఇంధన ధరల పెరుగుదలపై విపక్షాల నిప్పులు
- ఎన్నికలు ముగియగానే సామాన్యుడి జేబుకు చిల్లు
- మిగిలిన దోపిడీ విడతల వారీగా జరుగుతుందన్న రాహుల్ గాంధీ
- పేదలపై కొరడా ఝుళిపిస్తున్నారని విపక్షాల తీవ్ర విమర్శలు
- అంతర్జాతీయంగా ధరలు తగ్గినా ప్రయోజనం ఇవ్వలేదన్న జైరాం రమేశ్
- వృద్ధి అంచనాలు దారుణంగా పడిపోతాయని ఆందోళన

న్యూఢిల్లీ వెలుతురు మే 15:

దేశవ్యాప్తంగా సామాన్యుడి నడ్డి విరుస్తూ కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడంపై రాజకీయ యుద్ధం ముదిరింది. ఎన్నికల ప్రక్రియ ముగిసి, ప్రభుత్వాల ఏర్పాటు పూర్తి కాగానే మోదీ సర్కార్ తన అసలు రూపాన్ని బయటపెట్టిందని ప్రతిపక్షాలు ముక్తకంఠంతో విమర్శిస్తున్నాయి. పెట్రో ఉత్పత్తుల ధరల పెంపు అనేది దేశ ఆర్థిక వ్యవస్థపై పెను ప్రభావం చూపుతుందని, ఇది ద్రవ్యోల్బణాన్ని మరింత పెంచి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటడానికి దారితీస్తుందని కాంగ్రెస్ పార్టీ హెచ్చరించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని 'ఖరీదైన మనిషి'గా అభివర్ణించిన కాంగ్రెస్ నేతలు, ఆయన ప్రజలపై కనికరం లేకుండా 'కొరడా ఝుళిపించారని' ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ..మిగతా 02లో

# ఐదు దేశాల పర్యటనకు ప్రధాని మోదీ శ్రీకారం!



- మే 20 వరకు యూఏఈ, నెదర్లాండ్స్, స్వీడన్,
- నార్వే, ఇటలీ దేశాల్లో ప్రధాని షెడ్యూల్
- వాణిజ్యం, సాంకేతికత, హరిత ఇంధన రంగాల్లో
- వ్యూహాత్మక బలోపేతమే లక్ష్యంగా మోదీ విదేశీ యాత్ర
- మొదటి మజిలీగా అబుదాబి చేరుకోనున్న ప్రధాని
- అధ్యక్షుడు షేక్ మహమ్మద్‌తో కీలక చర్చలు
- యూరప్ దేశాలతో సెమీ కండక్టర్లు, గ్రీన్ హైడ్రోజన్
- రంగాల్లో చారిత్రాత్మక ఒప్పందాలకు అవకాశం
- ఓస్లోలో జరగనున్న భారత్-నార్డిక్ శిఖరాగ్ర
- సమావేశంలో పాల్గొననున్న భారత ప్రధాన మంత్రి

ఢిల్లీ వెలుతురు మే 15:

అంతర్జాతీయ సంబంధాలలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించేందుకు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఐదు దేశాల సుదీర్ఘ పర్యటనను ప్రారంభించారు. శుక్రవారం ఉదయం ఆయన ఢిల్లీ నుంచి అబుదాబికి బయలుదేరారు. మే 15 నుంచి మే 20 వరకు ఆరు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో మోదీ యూఏఈతో పాటు నెదర్లాండ్స్, స్వీడన్, నార్వే మరియు ఇటలీ దేశాలను సందర్శించనున్నారు. ..మిగతా 02లో



2

## నీట్ రీఎగ్జామ్ షెడ్యూల్ ఖరారు

- జూన్ 21న దేశవ్యాప్తంగా పునః పరీక్ష
- మే 3న జరిగిన పరీక్షా పత్రం లీక్
- నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కఠిన నిర్ణయం
- విద్యార్థుల భవిష్యత్తు కోసం జూన్ 21న పరీక్ష
- వచ్చే ఏడాది నుంచి సీబీటీ విధానంలో నీట్
- జూన్ 14 నుంచి అధికారిక వెబ్‌సైట్‌లో అడ్మిట్ కార్డులు
- రీ-ఎగ్జామ్ రాసే విద్యార్థులకు పరీక్షా ఫీజు మినహాయింపు
- పేపర్ లీకేజీ వెనుక ఉన్న సూత్రధారులపై సీబీఐ విచారణ
- ఇప్పటికే పలువురు కీలక నిందితుల అరెస్ట్
- వ్యవస్థ ప్రక్షాళన, మాల్‌ప్రాక్టీస్‌కు తావులేకుండా చర్యలు
- స్పష్టం చేసిన కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్
- నీట్ నుంచి శాశ్వత మినహాయింపు కోరుతూ ప్రధానికి స్టాలిన్ లేఖ

## ఐక్యరాజ్యసమితిలో మార్పు రావాల్సిందే

- బ్రిక్స్ వేదికగా భారత్ గళం
- భద్రతా మండలి సంస్కరణలపై జైశంకర్ కీలక వ్యాఖ్యలు
- పాలనా సంస్థల్లో అత్యవసర సంస్కరణలు చేపట్టాలని పిలుపు
- విస్తరించకపోతే దాని విశ్వసనీయత దెబ్బతింటుందని హెచ్చరిక
- తక్షణమే 'రాతపూర్వక చర్చలు' ప్రారంభించాలని డిమాండ్
- ఆర్థిక, వాణిజ్య సంస్థలు కాలం చెల్లిన నిబంధనలతో నడుస్తున్నాయని విమర్శ



2

## బీజేపీలో మరో బాంబు

- ఎన్‌వీ సుభాష్ పై కేంద్ర నాయకత్వానికి ఫిర్యాదు
- ముఖ్య అధికార ప్రతినిధి వ్యవహార శైలిపై అసంతృప్తి
- నియంతృత్వ ధోరణి, నిర్లక్ష్య వైఖరిపై ఆరోపణలు
- పార్టీ వాణిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వైఫల్యమని విమర్శ
- మీడియా ప్యానలిస్టులకు బాధ్యతలు ఇవ్వడంలేదని ఆవేదన
- ప్రత్యర్థి పార్టీలపై దూకుడు చూపడంలేదన్న అభ్యంతరం





2

## బండి సంజయ్‌పై దుష్ప్రచారం నిలిపివేయాలి

హైదరాబాద్ వెలుతురు మే 15:

ఇప్పటి వరకు బండి సంజయ్ ను టార్గెట్ చేస్తూ ప్రసారం చేసిన వీడియో క్లిప్పింగులను, పత్రికా క్లిప్పింగులను, డిజిటల్ కంటెంట్, వాల్ పోస్టర్లను తొలగించండి ఈనెల 26లోపు ఆయా వీడియో క్లిప్పింగులను, డిజిటల్, పత్రికా కథనాలను, పోస్టర్లను తొలగించకపోతే చర్యలు తప్పవు హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇకపై బండి సంజయ్ ను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ దుష్ప్రచారం చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరిక



2

## అదానీ కోసం దేశ ప్రయోజనాలు తాకట్టు

- ప్రధాని మోదీపై రాహుల్ గాంధీ నిప్పులు
- అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందం
- అదానీని కేసుల నుంచి తప్పించే 'బేరసారం' మాత్రమే
- ట్రంప్ హెచ్చరికలకు లొంగిపోయి 'ఆపరేషన్ సిందూర్ నిలిపివేత
- ప్రధాని ఒక పారిశ్రామికవేత్త కోసం ఇంత దిగజారాలా అంటూ నిలదీత
- అమెరికాలో అదానీపై ఉన్న క్రిమినల్ కేసులను ఎత్తివేసేందుకు సిద్ధం
- రూ. 2,500 కోట్ల లంచాల ఆరోపణలు; రూ. 150 కోట్లకు పైగా జరిమానాకు అదానీ అంగీకారం
- అమెరికాకు ఏకపక్ష లబ్ధి చేకూర్చేలా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేశారంటున్న విపక్షాలు
- 2020 నుంచి సాగుతున్న సోలార్ విద్యుత్ కాంట్రాక్టుల వివాదంలో అనూహ్య మలుపులు



2

## కరీంనగర్ కు మహర్దశ

- యూసీఎఫ్ కింద మూడు ప్రాజెక్టులకు కేంద్రం సూత్రప్రాయ ఆమోదం
- రూ.895 కోట్లు మంజూరు ప్రతిపాదనలకు ఓకే?
- ఫలించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ క్రుషి
- కరీంనగర్ మేయర్ పదవి బీజేపీకి అప్పగిస్తే వరద నిధులు పారిస్తానని గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన బండి
- ఇచ్చిన హామీ మేరకు ప్రధాని మోదీ, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిని కలిసిన సంజయ్



## 2034 తర్వాత జాతీయ రాజకీయాల్లోకి వెళ్తా

హైదరాబాద్ వెలుతురు మే 15:

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 2034లో రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపించి జాతీయ రాజకీయాల్లోకి వెళ్తానని చెప్పారు. అప్పటి వరకు తానే సీఎంగా ఉంటానన్నారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తన లక్ష్యమని చెప్పారు. జాతీయ రాజకీయాల్లోకి వెళ్లి రాహుల్ తర్వాతి స్థానంలో ఉంటానని వ్యాఖ్యానించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే రాహుల్ గాంధీ లక్ష్యమన్నారు.

## అమెరికా ఎప్పటికీ విశ్వ విజేతే

- చైనా అధ్యక్షుడి వ్యాఖ్యలతో ఏకీభవిస్తూనే బైడెన్‌పై ట్రంప్ నిప్పులు
- అమెరికా క్షీణిస్తున్న దేశమేనన్న జిన్‌పింగ్ మాటలు వాస్తవమన్న ట్రంప్
- జో బైడెన్ నాలుగేళ్ల 'నిద్రమత్తు' పాలన వల్లే వ్యవస్థ పతనమైందని విమర్శ
- బహిరంగ సరిహద్దులు, విచ్చలవిడి నేరాలు దేశానికి శాపమయ్యాయని వెల్లడి
- గత 16 నెలల్లో అమెరికాను ప్రపంచంలోనే శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దామని ధీమా
- చైనాతో మెరుగైన సంబంధాలు ఉండబోతున్నాయని ట్రంప్ ఆశాభావం
- ఇరాన్‌కు అణ్వాయుధాలు చిక్కనివ్వం; ఒప్పందం లేదంటే విధ్వంసమేనన్న ట్రంప్
- అమెరికా చమురు, వ్యవసాయ ఉత్పత్తులు, 200 బోయింగ్ విమానాల కొనుగోలుకు చైనా సానుకూలత



2

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిరంతర ప్రక్రియ

- జూన్ 2న ఆదిలాబాద్ నుంచి రెండో విడత ప్రారంభం
- గూడులేని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు
- జాయింట్ సర్వే తో భూ సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం

02



# నీట్ రీ-ఎగ్జామ్ షెడ్యూల్ ఖరారు

ఢిల్లీ వెలుతురు మే 15:

దేశవ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్‌యూజీ) చుట్టూ ముసురుకున్న వివాదాలకు కేంద్ర ప్రభుత్వం ఫుల్‌స్టాప్ పెట్టింది. మే 3న జరిగిన పరీక్షలో ప్రశ్నపత్రం లీకైందన్న ఆరోపణలు నిజమని ప్రాథమికంగా తేలడంతో, ఆ పరీక్షను రద్దు చేసి జూన్ 21న మళ్లీ నిర్వహించాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నిర్ణయించింది. ఈ మేరకు అధికారిక షెడ్యూల్‌ను శుక్రవారం వెల్లడించింది. సుమారు 23 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న ఈ సున్నితమైన అంశంపై కేంద్ర ప్రభుత్వం అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. విద్యార్థులకు ఎలాంటి మానసిక ఒత్తిడి కలగకుండా చూసేందుకు, పునఃపరీక్ష రాసే అభ్యర్థులు అదనంగా ఎలాంటి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని, కొత్తగా ఫీజులు చెల్లించాల్సిన పనిలేదని ఎన్టీఏ స్పష్టం చేసింది. జూన్ 14నుంచి అడ్మిట్ కార్డులను విడుదల చేసి, దేశవ్యాప్తంగా పక్కా భద్రత మధ్య పారదర్శకంగా పరీక్షను పూర్తి చేస్తామని అధికారులు భరోసా ఇచ్చారు. పాత పరీక్షా కేంద్రాలలో మార్పులు ఉండే అవకాశం ఉన్నందున విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్‌ను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. నీట్ పరీక్ష నిర్వహణలో చోటుచేసుకున్న లోపాలను సరిదిద్దేందుకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రంగంలోకి దిగారు. ఆయన నివాసంలో గురువారం రాత్రి ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వినీత్ జోషి, ఎన్టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్, సీబీఎస్ఈ మరియు కేంద్రీయ విద్యాలయ సీనియర్ అధికారులతో ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు తమకు మొదటి ప్రాధాన్యమని, ప్రశ్నపత్రం లీక్ చేసిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు వచ్చే ఏడాది (2027) నుంచి నీట్ పరీక్షను ఆఫ్‌లైన్ విధానం నుంచి పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ లేదా కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానానికి మార్చనున్నట్లు ఆయన కీలక ప్రకటన చేశారు.

# ఐక్యరాజ్యసమితిలో మార్పు రావాల్సిందే

ఢిల్లీ వెలుతురు మే 15:

ప్రపంచ రాజకీయాల్లో కీలక మార్పులు వస్తున్న తరుణంలో ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థల్లో తక్షణమే సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని భారత్ మరోసారి స్పష్టం చేసింది. ఢిల్లీలో జరిగిన బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశంలో భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ప్రసంగిస్తూ, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ప్రస్తుత ప్రపంచ వాస్తవాలకు అనుగుణంగా లేదని మండిపడ్డారు. ఐరాస మరింత ప్రభావవంతంగా పని చేయాలన్నా, దాని నిర్ణయాలకు విలువ ఉండాలన్నా భద్రతా మండలిని విస్తరించడం ఒక్కటే మార్గమని ఆయన అభిప్రాయపడ్డారు. శాశ్వత మరియు తాత్కాలిక సభ్య దేశాల సంఖ్యను పెంచడం ద్వారానే అన్ని ప్రాంతాలకు సరైన ప్రాతినిధ్యం లభిస్తుందని, లేని పక్షంలో ఈ సంస్థ ఉనికి నామమాత్రంగా మారిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. నేటి బహుళధృవ ప్రపంచంలో నమ్మకమైన, సంస్కరణలతో కూడిన బహుళపక్ష విధానం అత్యవసరమని, ఈ దిశగా బ్రిక్స్ కూటమి చురుకైన పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ఆర్థిక మరియు వాణిజ్య వ్యవస్థల పునర్నిర్మాణం గురించి జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత ప్రపంచ స్థాయి సంస్థలు దశాబ్దాల క్రితం నాటి పాత నిబంధనలతో పనిచేస్తున్నాయని, వీటి వల్ల అభివృద్ధి చెందుతున్న దేశాలకు సరైన న్యాయం జరగడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బహుళపక్ష అభివృద్ధి బ్యాంకులను మరింత బలోపేతం చేయాలని, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నిర్మాణంలో సమూల మార్పులు తీసుకురావాలని కోరారు. ముఖ్యంగా వాతావరణ నిధులు (క్లైమేట్ ఫైనాన్స్) మరియు అభివృద్ధి నిధుల లభ్యతను పెంచడం ద్వారా పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఊతమివ్వాలని సూచించారు. ప్రపంచ వాణిజ్య సంస్థ (WTO) కేంద్రంగా పారదర్శకమైన, నిష్పక్షపాతమైన మరియు అందరినీ కలుపుకుపోయే ఆర్థిక వ్యవస్థ ఉండాలని భారత్ కోరుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. ఈ సంస్కరణల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు రాతపూర్వక చర్చలు (టెక్స్ట్ బేస్డ్ నెగోసియేషన్స్) తక్షణమే ప్రారంభించాలని ఆయన అంతర్జాతీయ సమాజాన్ని డిమాండ్ చేశారు.

# కరీంనగర్ కు మహర్ధశ

కరీంనగర్ వెలుతురు మే 15:

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కు మహర్ధశ పట్టనుంది. స్మార్ట్ సిటీ పేరుతో ఇప్పటికే కరీంనగర్ కు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసిన కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం తాజాగా అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) స్కీం కింద మరో మూడు ప్రాజెక్టులకు సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. వీటి మొత్తం విలువ రూ.895 కోట్లు. అందులో భాగంగా పట్టణ రవాణా మెరుగుదలకు మోడల్ రోడ్లు, జంక్షన్లు, స్కైవాక్‌లు, నాన్‌మోటరైజ్డ్ ట్రాన్స్‌పోర్ట్ సదుపాయాలతోపాటు ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌ల నిర్మాణం, అభివృద్ధి కోసం రూ. 700 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించింది. అట్లాగే వర్షపు నీటి కాలువల నిర్మాణం, పునరావాసం, వరద నివారణ చర్యల కోసం రూ.130 కోట్లు కేటాయించనుంది. అట్లాగే కరీంనగర్‌లో సమగ్ర ఘన వ్యర్థాల నిర్వహణ (Integrated Solid Waste Management) రూ.65 కోట్లతో ప్రతిపాదనలను సిద్ధం చేసింది. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (Ministry of Housing and Urban Affairs) కు చెందిన అపెక్స్ కమిటీ ఇటీవల ఢిల్లీలో సమావేశమై ఈ ప్రతిపాదనలపై చర్చించి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. అందులో భాగంగా కమిటీ ఆదేశాల మేరకు నేడు (శనివారం) కేంద్ర అధికారుల బృందం కరీంనగర్ కు రానుంది. కరీంనగర్ లో పర్యటించడంతోపాటు స్థానిక అధికారులతో సమావేశం కానున్నారు.

**ఫలించిన బండి సంజయ్ క్రుషి**

యూసీఎఫ్ స్కీంలో కరీంనగర్ ను చేర్చడంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ చేసిన క్రుషి ఫలించింది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ మేయర్ పదవిని బీజేపీకి అప్పగిస్తే నిధులు వరద పారిస్తానంటూ బండి సంజయ్ హామీ ఇచ్చారు. కరీంనగర్ ప్రజలు మేయర్ పదవిని కాషాయ పార్టీకి అప్పగించడంతో ఇచ్చిన నిధులు తీసుకురావడంపైనే ద్రుష్టి సారించారు. అందులో భాగంగా ఇటీవల 15వ ఆర్థిక సంఘం నిధుల కింద కార్పొరేషన్ కు రూ.10 కోట్లు మంజూరయ్యాయి. దీంతోపాటు స్మార్ట్ సిటీలో భాగంగా కార్పొరేషన్ కు రూ.70 కోట్లు వచ్చాయి.

# ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిరంతర ప్రక్రియ

హైదరాబాద్, వెలుతురు మే 15:

పేద కుటుంబానికి సొంత ఇల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాదని, అది వారి ఆత్మ గౌరవానికి, భద్రమైన భవిష్యత్తుకు ప్రతీకని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంతరెడ్డి గారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల మంజూరును నిరంతరం కొనసాగించే ప్రక్రియగా చేపట్టిందన్నారు. గూడులేని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు సమకూర్చడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇవ్వని విధంగా ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయంతో (వంద శాతం సబ్సిడీతో) పేదల ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టి తెలంగాణా ప్రభుత్వం దేశానికి తలమానికంగా నిలిచిందన్నారు. రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై జిల్లాల వారీగా ప్రజా ప్రతినిధులతో నిర్వహిస్తున్న సమావేశాల్లో భాగంగా శుక్రవారం నాడు హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు, హౌసింగ్ డిపార్ట్ మెంట్ అధికారులతో మంత్రిగారు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఖమ్మం ఇన్ ఛార్జి మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి, మంత్రులు శ్రీమతి దాసరి అనసూయ సీతక్క, శ్రీమతి కొండా సురేఖ , పొన్నం ప్రభాకర్, పార్లమెంటు సభ్యులు వేం నరేందర్ రెడ్డి, పి.బలరాం నాయక్ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరును విజయవంతంగా పూర్తి చేసి లక్షలాది పేద కుటుంబాల సొంత ఇంటి కలలను నెరవేర్చామని తెలిపారు.

# మోదీ మార్కు వసూళ్లు షురూ

(మొదటి పేజీ తరువాయి)

ముడి చమురు ధరలు కనిష్ఠ స్థాయికి పడిపోయినప్పుడు ఆ ప్రయోజనాన్ని సామాన్యులకు అందించని కేంద్రం, ఇప్పుడు కొద్దిపాటి పెరుగుదల సాకుతో భారాలను మోపడం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ పెంపు కేవలం ప్రారంభం మాత్రమేనని, రాబోయే రోజుల్లో విడతల వారీగా ప్రజల నుంచి భారీగా వసూలు చేయడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ పరిణామంపై అత్యంత ఘాటుగా స్పందించారు. ఇంధన ధరల పెంపును ఆయన పక్కా 'వసూలీ' (దోపిడీ)గా అభివర్ణించారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలకు సామాన్య ప్రజలు మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన శుక్రవారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా దుయ్యబట్టారు. "మోదీ ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలకు ఇప్పటికే రూ. 3 షాక్ తగిలింది. ఇది కేవలం ఆరంభం మాత్రమే, మిగిలిన వసూలు కార్యక్రమం విడతల వారీగా కొనసాగుతుంది" అని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. దేశంలో ఆర్థిక అసమానతలు పెరుగుతున్న తరుణంలో, ఇలాంటి నిర్ణయాలు మధ్యతరగతి మరియు పేద వర్గాలను కోలుకోలేని దెబ్బ తీస్తాయని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రజల జేబుల నుంచి డబ్బులు గుంజడమే మోదీ నమూనా పాలన అని ఆయన విమర్శించారు.కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఈ వ్యవహారంపై సుదీర్ఘ వివరణ ఇస్తూ, దేశ ఆర్థిక భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేశారు. సంవత్సరాలుగా అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు వినియోగదారులకు ఊరటనివ్వాలని కాంగ్రెస్ పదేపదే కోరినప్పటికీ కేంద్రం పెడచెవిన పెట్టిందని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో ధరలు పెరుగుతున్నాయని సాకులు చెబుతున్నారని, కానీ అసలు కారణం ఎన్నికలు ముగియడమేనని ఆయన విశ్లేషించారు. ఇప్పటికే వాణిజ్య ఎల్‌పీజీ ధరలను పెంచిన ప్రభుత్వం, ఇప్పుడు పెట్రోల్, డీజిల్ ధరలను కూడా పెంచి ద్రవ్యోల్బణాన్ని 6 శాతానికి చేర్చుతోందని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల దేశ వృద్ధి అంచనాలు గణనీయంగా తగ్గుతాయని, సామాన్యుడి కొనుగోలు శక్తి పడిపోతుందని జైరాం రమేశ్ హెచ్చరించారు. ప్రభుత్వ మిత్రులైన అంతర్జాతీయ శక్తుల వల్ల తలెత్తిన సంక్షోభానికి భారతీయ వినియోగదారులను బలి చేయడం అన్యాయమని ఆయన మండిపడ్డారు.మరోవైపు ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ తనదైన శైలిలో కేంద్రంపై సెటైర్లు వేశారు. తన పార్టీ చిహ్నమైన సైకిల్‌పై ప్రయాణిస్తున్నట్లు ఉన్న ఒక కార్టూన్‌ను ఆయన సోషల్ మీడియాలో పంచుకున్నారు. అందులో "పెట్రోల్‌పై తక్కువ ఖర్చు చేయండి: ప్రధాని" అనే పెద్ద ప్రకటన కనిపిస్తుండగా, దానికి కౌంటర్‌గా "ముందుకు సాగాలంటే సైకిలే మార్గం" అని అఖిలేష్ క్యాప్షన్ ఇచ్చారు. ఇంధన ధరల భారంతో బతకడం కష్టంగా మారిన తరుణంలో ప్రత్యామ్నాయాల వైపు చూడాల్సి వస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. ఎస్పీ అధికార ప్రతినిధి డాక్టర్ అశుతోశ్ వర్మ మాట్లాడుతూ, బీజేపీకి దేశ ప్రయోజనాల కంటే ఎన్నికల ప్రయోజనాలే ముఖ్యమని ఆరోపించారు. దేశంలో సంక్షోభ సమయాల్లో కూడా ఎన్నికలు నిర్వహించిన ఘనత బీజేపీదేనని, ఇప్పుడు ఎన్నికలు ముగియగానే పారిశ్రామికవేత్తల లాభాల కోసం ధరలు పెంచారని విమర్శించారు. రిలయన్స్, అదానీ, నయారా వంటి దిగ్గజ సంస్థలు రాయితీపై ఇంధనం ఇవ్వాలని, ఆ భారాన్ని ప్రజలపై వేయకూడదని ఆయన డిమాండ్ చేశారు.

# బీజేపీలో మరో బాంబు

హైదరాబాద్ వెలుతురు మే 15:

తెలంగాణ బీజేపీ అంతర్గత వ్యవహారాల్లో మరోసారి చర్చనీయాంశమైన పరిణామం చోటుచేసుకుంది. పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి ఎన్‌వీ సుభాష్‌పై కేంద్ర నాయకత్వానికి ఫిర్యాదు వెళ్లినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆయన వ్యవహార శైలి, పార్టీ కార్యకలాపాల్లో తీసుకుంటున్న నిర్ణయాలపై పలువురు నేతలు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ ఎన్‌వీ సుభాష్ నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్నారని, ఇతర అధికార ప్రతినిధులు, ప్యానలిస్టులకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఫిర్యాదులో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మీడియా చర్చల్లో పార్టీ వాణిని బలంగా వినిపించేలా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆయన విఫలమయ్యారని కొందరు నేతలు అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మీడియా విభాగాన్ని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో పలు ప్యానలిస్టులు, అధికార ప్రతినిధులను నియమించినప్పటికీ వారికి బాధ్యతల పంపిణీలో నిర్లక్ష్యం కొనసాగుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో నియమితులైన పలువురు నేతలు అసంతృప్తిగా ఉన్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే ప్రత్యర్థి పార్టీలపై రాజకీయంగా దూకుడు ప్రదర్శించాల్సిన సమయంలో ఎన్‌వీ సుభాష్ తగిన చురుకుదనం చూపడంలేదనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. పార్టీ కార్యక్రమాల కంటే వ్యక్తిగత ప్రభావానికే ప్రాధాన్యం ఇస్తున్నారనే అభిప్రాయం కొందరిలో ఉందని సమాచారం. గతంలో జరిగిన ఒక ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా బీజేపీ అభ్యర్థికి పూర్తి స్థాయిలో సహకరించకుండా, ప్రత్యర్థి అభ్యర్థికి పరోక్షంగా మద్దతు లభించేలా అంతర్గతంగా వ్యవహరించారనే ఆరోపణలను కూడా ఫిర్యాదులో ప్రస్తావించినట్లు తెలిసింది. ఈ అంశం అప్పట్లోనే పార్టీ వర్గాల్లో చర్చకు దారితీసిందని అంటున్నారు.
ఇక పార్టీ కార్యాలయానికి వచ్చే కార్యకర్తలు, నాయకులతో ఆయన వ్యవహార శైలి సానుకూలంగా ఉండదని, పలువురిని పట్టించుకోరనే భావన పార్టీ శ్రేణుల్లో పెరుగుతోందని సమాచారం. దీని వల్ల క్షేత్రస్థాయి కార్యకర్తల్లో అసహనం పెరుగుతోందని కొందరు నేతలు అభిప్రాయపడుతున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా లక్ష్మణ్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్ హయాంలోనూ ఎన్‌వీ సుభాష్ ప్రభావం కొనసాగిందని, పార్టీ కార్యాలయంలో ఆయన చెప్పిందే అమలవుతోందనే భావన ఏర్పడిందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితి పార్టీకి ప్రతికూల ప్రభావం చూపుతోందని కొందరు నేతలు కేంద్ర నాయకత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. పార్టీ ఆర్థిక వ్యవహారాల్లో కూడా ఆయన జోక్యం పెరుగుతోందని, దీనివల్ల అనవసర వివాదాలు తలెత్తుతున్నాయనే అంశాన్ని కూడా ఫిర్యాదులో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ఈ ఫిర్యాదుపై కేంద్ర బీజేపీ నాయకత్వం ఎలా స్పందిస్తుందన్నది ఇప్పుడు పార్టీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. రానున్న రోజుల్లో రాష్ట్ర బీజేపీలో మరిన్ని రాజకీయ పరిణామాలు చోటుచేసుకునే అవకాశముందన్న చర్చ సాగుతోంది.

# అదానీ కోసం దేశ ప్రయోజనాలు తాకట్టు

న్యూఢిల్లీ వెలుతురు మే 15:

దేశవ్యాప్తంగా రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తూ, ప్రధాని నరేంద్ర మోదీకి మరియు పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీకి మధ్య ఉన్న సంబంధాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి సంచలన ఆరోపణలు చేశారు. అమెరికాలో నమోదైన తీవ్రమైన అవినీతి మరియు మోసం కేసుల వల నుంచి గౌతమ్ అదానీని సురక్షితంగా బయటపడేసేందుకే, ప్రధాని మోదీ అమెరికాకు పూర్తి లబ్ధి చేకూర్చే ఏకపక్ష వాణిజ్య ఒప్పందంపై సంతకం చేశారని రాహుల్ ధ్వజమెత్తారు. అమెరికా, భారత్ మధ్య జరిగింది నిజమైన వాణిజ్య ఒప్పందం (ట్రేడ్ డీల్) కాదని, అది కేవలం అదానీని కాపాడేందుకు జరిగిన 'బేరసారం' మాత్రమేనని ఆయన మండిపడ్డారు. దేశ ప్రయోజనాలను పక్కన పెట్టి, ఒక వ్యక్తిని కాపాడటానికి ప్రధాని పదవిని అడ్డం పెట్టుకుని అమెరికా వద్ద మోదీ మోకరిల్లారని ఆయన హిందీలో చేసిన ట్వీట్‌లో తీవ్రంగా విమర్శించారు. సోలార్ విద్యుత్ కాంట్రాక్టుల కోసం లంచాలు ఇవ్వడం, పెట్టుబడిదారులను తప్పుదోవ పట్టించడం వంటి ఆరోపణలతో 2024 నవంబర్‌లో అమెరికాలో అదానీపై క్రిమినల్ కేసులు నమోదైన విషయం విదితమే. అయితే, ఇప్పుడు ఆ కేసులను ఎత్తివేసేందుకు అమెరికా న్యాయశాఖ సిద్ధమవుతోందన్న వార్తలు రాగానే రాహుల్ ఈ ఘాటు విమర్శలు చేయడం గమనార్హం. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా స్పందిస్తూ, మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఎండగట్టారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి వచ్చిన హెచ్చరికలకు భయపడి, దేశ ప్రయోజనాలకు అత్యంత కీలకమైన 'ఆపరేషన్ సిందూర్'ను 2025 మే 10న ప్రధాని మోదీ అకస్మాత్తుగా నిలిపివేశారని ఆయన గుర్తు చేశారు. అప్పట్లో ఈ నిర్ణయంపై ఎన్నో అనుమానాలు వ్యక్తమైనప్పటికీ, ఇప్పుడు అదానీపై ఉన్న కేసులను ఎత్తివేసేందుకు ట్రంప్ ప్రభుత్వం సిద్ధమవ్వడం వెనుక ఉన్న అసలు రహస్యం ఇదేనని జైరాం రమేశ్ ధ్వజమెత్తారు.

# ఐదు దేశాల పర్యటనకు ప్రధాని మోదీ శ్రీకారం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ కీలక శక్తిగా ఎదుగుతున్న తరుణంలో, వ్యూహాత్మక భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేసుకోవడం, వాణిజ్య బంధాలను విస్తరించడం మరియు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగనుంది. ముఖ్యంగా రక్షణ, హరిత ఇంధనం, సెమీ కండక్టర్ల తయారీ మరియు డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వంటి రంగాలలో భారత్ తన ప్రభావాన్ని చాటుకునేందుకు ఈ ఉన్నత స్థాయి చర్చలు దోహదపడనున్నాయి. యూరప్ మరియు గల్ఫ్ ప్రాంతాల మధ్య ఉన్న భౌగోళిక రాజకీయ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, ఈ ఐదు దేశాల పర్యటన భారత్‌కు అత్యంత కీలకమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రధాని పర్యటనలో మొదటి మజిలీగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) నిలిచింది. శుక్రవారం మధ్యాహ్నం అబుదాబి చేరుకోనున్న మోదీ, అక్కడ దాదాపు నాలుగు గంటల పాటు గడపనున్నారు. ఈ స్వల్ప సమయంలోనే యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో ఆయన ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఇంధన భద్రత, ప్రాంతీయ శాంతి, మరియు వాణిజ్య పెట్టుబడుల వంటి అంశాలు ఈ చర్చల్లో ప్రధానంగా చోటు చేసుకోనున్నాయి. భారత్‌కు యూఏఈ అత్యంత నమ్మకమైన వాణిజ్య భాగస్వామిగా కొనసాగుతోంది. పశ్చిమాసియా మరియు ఆఫ్రికా దేశాలకు భారతీయ ఎగుమతులు చేరవేయడానికి యూఏఈ ఒక ముఖద్వారంగా ఉంది. ఈ సందర్భంగా యూఏఈ అంతర్జాతీయ సహకార శాఖ మంత్రి రీమ్ అల్ హషిమీ మాట్లాడుతూ, మోదీ పర్యటన ఇరు దేశాల మధ్య ఉన్న సుదీర్ఘ మైత్రిని కొత్త శిఖరాలకు చేరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని రాక కోసం అక్కడి ప్రవాస భారతీయులు కూడా భారీ ఎత్తున ఏర్పాట్లు చేయడం విశేషం.యూఏఈ పర్యటన అనంతరం ప్రధాని మోదీ నెదర్లాండ్స్ వెళ్లనున్నారు. మే 15 నుంచి 17 వరకు ఆయన అక్కడ పర్యటిస్తారు. నెదర్లాండ్స్ ప్రధాని రాబ్ జెట్టెన్‌తో మోదీ అధికారికంగా భేటీ అవుతారు. ఈ పర్యటనలో అత్యంత కీలకమైన అంశం సెమీ కండక్టర్ల రంగంలో సహకారం. ప్రపంచ స్థాయి సెమీ కండక్టర్ తయారీ సామర్థ్యం ఉన్న నెదర్లాండ్స్ నుంచి భారత్ పెట్టుబడులను, సాంకేతికతను ఆశిస్తోంది. దీనితో పాటు గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, నీటి నిర్వహణ, మరియు రక్షణ రంగాలలో పరస్పర సహకారంపై ఇరు దేశాలు ఒక అవగాహనకు రానున్నాయి. 2017 తర్వాత మోదీ నెదర్లాండ్స్‌లో పర్యటించడం ఇదే రెండోసారి కావడంతో, డచ్ పాలకులు ఆయనకు ఘనస్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు. కింగ్ విల్లెం అలెగ్జాండర్ మరియు క్వీన్ మాక్సిమాలను కూడా ప్రధాని కలుసుకోనున్నారు. ఐరోపాలో భారత్‌కు ఉన్న అతిపెద్ద వాణిజ్య భాగస్వాములలో నెదర్లాండ్స్ ఒకటి కావడం ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యతను చేకూరుస్తోంది. స్వీడన్ పర్యటనలో భాగంగా మే 17, 18 తేదీలలో ప్రధాని మోదీ స్టాక్‌హోమ్ చేరుకుంటారు. స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టర్‌సన్‌తో కలిసి ఆయన ద్వైపాక్షిక సంబంధాలపై సమీక్ష నిర్వహిస్తారు. ఈ పర్యటనలో ప్రత్యేక ఆకర్షణగా 'యూరోపియన్ రౌండ్ టేబుల్ ఫర్ ఇండస్ట్రీ' కార్యక్రమం నిలవనుంది. ఇందులో యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లేయెన్‌తో కలిసి మోదీ పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. కృత్రిమ మేధ (ఏఐ), ఆవిష్కరణలు మరియు స్టార్టప్ రంగాలలో స్వీడన్ అనుభవాన్ని భారత్ వినియోగించుకోవాలని భావిస్తోంది. ఇరు దేశాల మధ్య గతంలో కుదిరిన ఇన్నోవేషన్ పార్టనర్‌షిప్‌ను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఈ పర్యటన ఉపయోగపడనుంది. స్వీడన్ కంపెనీలు ఇప్పటికే భారత్‌లో భారీగా పెట్టుబడులు పెట్టగా, మేక్ ఇన్ ఇండియా పథకంలో భాగంగా మరింత మంది పెట్టుబడిదారులను ఆకర్షించేలా మోదీ చర్చలు జరపనున్నారు.

# అమెరికా ఎప్పటికీ విశ్వ విజేతే

అమెరికా వెలుతురు మే 15:

అంతర్జాతీయ రాజకీయ యవనికపై అగ్రరాజ్యం అమెరికా స్థానం, దాని భవిష్యత్తుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన చైనా పర్యటన ముగింపులో భాగంగా బీజింగ్‌లో ఒక అమెరికన్ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలోనూ, తన సొంత సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్ సోషల్' లోనూ ఆయన ఆసక్తికర అంశాలను వెల్లడించారు. అమెరికా ఒక క్షీణిస్తున్న దేశం అంటూ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ చేసిన వ్యాఖ్యలను ట్రంప్ నూటికి నూరు శాతం సమర్థించడం గమనార్హం. అయితే, ఈ క్షీణతకు కారణం తన పరిపాలన కాదని, మాజీ అధ్యక్షుడు జో బైడెన్ అనుసరించిన తప్పుడు విధానాలేనని ఆయన స్పష్టం చేశారు. బైడెన్ తన నాలుగేళ్ల పదవీ కాలంలో అమెరికాను ఆర్థికంగా, సైనికంగా బలహీనపరిచారని, ఆయన హయాంలో అమెరికా నిజంగానే పతనావస్థకు చేరుకుందని ట్రంప్ విశ్లేషించారు. నిద్రమత్తులో సాగిన బైడెన్ పాలనలో అమెరికా తన ప్రాభవాన్ని కోల్పోయిందని, కానీ తాను బాధ్యతలు చేపట్టిన ఈ 16 నెలల కాలంలో దేశం మళ్లీ ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక మరియు సైనిక శక్తిగా ఆవిర్భవించిందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.అమెరికా పతనానికి దారితీసిన అంశాలను ట్రంప్ తన పోస్ట్‌లో సుదీర్ఘంగా వివరించారు. దేశ సరిహద్దులను బహిరంగంగా వదిలేయడం, భారీగా పెరిగిన పన్నులు, ట్రాన్స్‌జెండర్ అనుకూల విధానాలు, మహిళల క్రీడల్లోకి పురుషుల ప్రవేశం వంటి సామాజిక మార్పులతో పాటు 'వైవిధ్యంసమానత్వంసమ్మిళితత్వం' (DEI) వంటి విధానాలు దేశ మూలాలను దెబ్బతీశాయని ఆయన ఆరోపించారు. వీటితో పాటు దారుణమైన అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలు, నగరాల్లో విచ్చలవిడి నేరాలు పెరిగిపోవడం వల్ల అమెరికా ప్రతిష్ట దిగజారిందని ఆయన పేర్కొన్నారు. వాస్తవానికి రెండు సంవత్సరాల క్రితం అమెరికా పతనమవుతున్న దేశంగా ఉండేదని, ఆ విషయంలో జిన్‌పింగ్‌తో తాను ఏకీభవిస్తానని చెబుతూనే, ఇప్పుడు పరిస్థితి మారిందని వివరించారు. తన హయాంలో స్టాక్ మార్కెట్లు ఆల్ టైం గరిష్ట స్థాయికి చేరుకున్నాయని, 401 వేల రిటైర్మెంట్ పొదుపు ఖాతాలను పునరుద్ధరించామని, వెనిజువెలాలో సైనిక విజయం సాధించడమే కాకుండా ఇరాన్‌ను సైనికంగా కోలుకోలేని విధంగా దెబ్బతీశామని ట్రంప్ తన విజయాల జాబితాను ఏకరువు పెట్టారు. చైనా పర్యటనలో తనకు లభించిన అపూర్వ స్వాగతంపై ట్రంప్ ముగ్ధులయ్యారు. షీ జిన్‌పింగ్ ఒక అద్భుతమైన వ్యక్తి అని, ఆయన పని పట్ల చూపే నిబద్ధత తనకు ఎంతో నచ్చిందని కొనియాడారు. 150 కోట్ల జనాభా ఉన్న దేశాన్ని నడిపించే నాయకుడిగా జిన్‌పింగ్‌ను తాను గౌరవిస్తానని, తనకు లభించిన సైనిక గౌరవ వందనం హాలీవుడ్ సినిమాల్లో కూడా కనిపించని రీతిలో అద్భుతంగా ఉందని ప్రశంసించారు. తన పరిపాలన సాధించిన విజయాలను చూసి జిన్‌పింగ్ స్వయంగా అభినందించారని ట్రంప్ వెల్లడించారు. అమెరికాలో ప్రస్తుతం రికార్డు స్థాయిలో 18 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయని, ప్రపంచంలోనే అత్యుత్తమ ఉద్యోగ మార్కెట్ ఏర్పడిందని ఆయన వివరించారు. చైనాతో మరింత బలమైన, మెరుగైన సంబంధాలను తాము ఆశిస్తున్నామని, అమెరికా చమురు, వ్యవసాయ ఉత్పత్తులను కొనాల్సిందిగా జిన్‌పింగ్‌ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. అంతే కాకుండా, 200 బోయింగ్ విమానాల కొనుగోలుకు కూడా చైనా అధ్యక్షుడి నుంచి సానుకూల సంకేతాలు వచ్చాయని ట్రంప్ ప్రకటించారు. ఇది అమెరికా ఆర్థిక వ్యవస్థకు భారీ ఊతాన్నిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# స్టార్ హోటళ్లలోనూ కల్లు, నీరా అందుబాటులోకి తెస్తాం: పొన్నం

హైదరాబాద్ వెలుతురు మే 15:

తెలంగాణ సంస్కృతిలో అంతర్భాగమైన తాటి కల్లు, నీరాకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ నర్సరీల్లో తాటి, ఈత మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తామని, హైదరాబాద్‌లోని ప్రధాన, ఐదు నక్షత్రాల హోటళ్లలనూ స్వచ్ఛమైన కల్లు, నీరా అందుబాటులో ఉంచేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ డా.బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్నలతో కలిసి మంత్రి మాట్లాడారు. ‘‘తాటి కల్లు ప్రకృతి ప్రసాదించిన ఔషధం. ఇలాంటి సహజసిద్ధ పానీయాలపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాల్సిన అవసరముంది. నర్సరీల ద్వారా తాటి, ఈత మొక్కల పంపిణీ చేపట్టి, భవిష్యత్తులో తాటివనాల పెంపకానికి ప్రాధాన్యమిస్తాం. తాటి కల్లు, గీత కార్మికులను పోత్సహించడం, గౌరవించాలనే ఉద్దేశంతో చిలుకూరు సమీపంలోని ఎక్స్‌పీరియం పార్కులో ఈ నెల 24న ‘తాటి మేళా’ పేరుతో మ్యూజిక్ ఫెస్టివల్‌ని నిర్వహిస్తున్నారు. అక్కడ 250 రకాల తాటి మొక్కలను నాటారు’ అని మంత్రి పొన్నం వివరించారు. మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ మట్లాడుతూ... కల్లును రాష్ట్ర పానీయంగా గుర్తించాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో ఎక్స్‌పీరియం పార్కు ఛైర్మన్ రామ్‌దేవ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మా మాక్‌టెక్ ల్యాబ్‌నెక్స్ట్ ఎక్స్‌పో 2026' కోసం హైదరాబాద్‌లో రోడ్‌షో నిర్వహించిన ఈఈపీసీ,భారత్

- **భారత ఉక్కు పరిశ్రమ పునాదిగా దేశ ఫార్మా రంగం విస్తరిస్తోంది: జాయింట్ డీజీఎఫ్‌టీ శ్రీ అక్షయ్ ఎస్.సి.**

హైదరాబాద్, వెలుతురు మే 15:





'ఫార్మా మాక్‌టెక్ ల్యాబ్‌నెక్స్ట్ ఎక్స్‌పో 2026' రెండో విడతకు సన్నాహకంగా దేశంలోని అగ్రగామి ఇంజనీరింగ్ ఎగుమతుల ప్రోత్సాహక సంస్థ అయిన ఈఈపీసీ భారత్ ఈ రోజు హైదరాబాద్‌లో రోడ్‌షోను నిర్వహించింది. ఫార్మా యంత్రాలు, ల్యాబ్ పరికరాల రంగంలో భారత దేశాన్ని ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దడంపై ఈ కార్యక్రమంలో చర్చాగోష్ఠులు చేపట్టారు.
సెప్టెంబర్ 7 నుంచి 9 వరకు ఢిల్లీలోని భారత్ మండపంలో రెండో విడత 'ఫార్మా మాక్‌టెక్ ల్యాబ్‌నెక్స్ట్ ఎక్స్‌పో 2026' జరగనుంది. భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద ఫార్మా ప్రదర్శనలలో ఒకటిగా పేరుగాంచిన ఐపెక్స్‌తో కలిపి ఈ ఎక్స్‌పోను నిర్వహించనున్నారు. ఈ ప్రదర్శనలు ఫార్మా, వైద్యారోగ్య ఇంజనీరింగ్ రంగానికి సంబంధించిన పూర్తి విలువ గొలుసును ఒకే వేదికపైకి తీసుకురానున్నాయి.
ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ ప్రాంతీయ సంయుక్త డీజీఎఫ్టీ అక్షయ్ ఎస్.సి... ఈ రంగాల వ్యూహాత్మక మద్దతును ప్రముఖంగా ప్రస్తావిస్తూ, భారతదేశ ఫార్మాస్యూటికల్ (ఔషధ) రంగం భవిష్యత్తు వృద్ధి, దేశీయ ఉక్కు, ఉత్పాదక రంగాల బలంపైనే గణనీయంగా ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు.
ఉత్పాదకులు ప్రపంచ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మారవలసిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. అలాగే ప్రత్యేక యంత్రాల దేశీయ ఉత్పత్తిని వేగవంతం చేయాలని ఆయన పరిశ్రమ రంగాన్ని కోరారు.
ఈఈపీసీ భారత్ కార్యనిర్వాహక డైరెక్టర్ కార్యదర్శి అధిప్ మిత్ర స్వాగత ప్రసంగం చేశారు. అమెరికాకు చేసే ఫార్మా ఎగుమతులను 2030 నాటికి 130 బిలియన్ డాలర్లకు పెంచాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. దీనికోసం తయారీదారులు, ఎగుమతిదారులు విలువ ఆధారిత, ఆవిష్కరణలతో కూడిన నైపుణ్యాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.
ఫార్మా 4.0, ఆటోమేషన్, ప్రిసిషన్ డ్రగ్ డెలివరీ, నాణ్యమైన ల్యాబ్ పరికరాల వంటి తాజా ఆవిష్కరణల గురించి తెలుసుకునేందుకు 'ఫార్మా మాక్‌టెక్ ల్యాబ్‌నెక్స్ట్ ఎక్స్‌పో 2026' ఒక విశిష్టమైన అవకాశాన్ని కల్పిస్తుందని ఆయన వివరించారు.
ఈ రోడ్‌షోలో పరిశ్రమల నాయకులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఇతర భాగస్వాములు పాల్గొన్నారు. హాజరైన వారికి పరస్పర చర్చలు, నెట్‌వర్కింగ్ కోసం ఈ కార్యక్రమం మంచి అవకాశాన్ని కల్పించింది.
ఈ రోడ్‌షోలో జాయింట్ డీజీఎఫ్‌టీ (ఆర్‌ఏ హైదరాబాద్) శ్రీ అక్షయ్ ఎస్.సీ, సీడీఎస్‌సీఓ డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ కే. నరేంద్రన్, హైదరాబాద్ ఈసీజీసీ సీనియర్ మేనేజర్ సురేష్ బాబు అతిథులుగా పాల్గొన్నారు.
ఈ కార్యక్రమంలో రంగానికి సంబంధించిన నిపుణులు అభిప్రాయాలను పంచుకున్నారు. ఫార్మా యంత్రాలు, ల్యాబ్ పరికరాల రంగంలో వస్తున్న కొత్త అవకాశాల గురించి వారు చర్చించారు. ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో ప్రభుత్వ చర్యలు, సుస్థిరత, డిజిటల్ పరివర్తన, అత్యాధునిక తయారీ పద్ధతుల వంటి అంశాలపై ఈ చర్చలు సాగాయి.
ప్రపంచ దేశాల వ్యాపార ప్రతినిధుల బృందాలతో నిర్వహించే వరుస సెమినార్లు, కాన్ఫరెన్స్‌లు, ముఖాముఖి కొనుగోలుదారువిక్రేత సమావేశాలు తాజా పరిజ్ఞానాన్ని పంచుకోవడానికి, అంతర్జాతీయ వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఎంతగానో దోహదపడతాయని అధిప్ మిత్ర తెలిపారు.
నేడు జరిగిన ఈ రోడ్‌షోలో భాగంగా 'స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్,నెక్స్ట్‌జెన్‌లాబొరేటరీపరిష్కారాల ద్వారా ఫార్మా బయోటెక్ పరిశ్రమల పరివర్తన' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. 'ఫార్మా మాక్‌టెక్ ల్యాబ్‌నెక్స్ట్ ఎక్స్‌పో 2026' గురించి ఈఈపీసీభారత్ప్రాంతీయడైరెక్టర్‌రాకేష్‌సూరజ్ ప్రెజెంటేషన్ ఇచ్చారు.
పాల్గొన్నవక్తలుతమఅభిప్రాయాలుపంచుకుంటూ, ఫార్మా మెషినరీ, ల్యాబ్ ఎక్విప్‌మెంట్ రంగాలలో వస్తున్నసరికొత్తఅవకాశాలగురించి చర్చించారు. ఈ రంగంలో ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో ప్రభుత్వ కార్యక్రమాలు, స్థిరత్వం, డిజిటల్ పరివర్తన నుండిఅత్యాధునికఉత్పాదకపద్ధతులవరకువివిధ అంశాలు ఈ చర్చల్లో చోటుచేసుకున్నాయి.
ప్రపంచ వ్యాక్సిన్ సరఫరాలో దాదాపు మూడో వంతు, భారతదేశ మొత్తం బల్క్ డ్రగ్ ఉత్పత్తిలో సుమారు 40 శాతం వాటాను హైదరాబాద్ కలిగి ఉన్నందున ఇక్కడ రోడ్‌షో నిర్వహించడం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. జీడిమెట్ల, బాలానగర్, కూకట్‌పల్లి వంటి ఇంజనీరింగ్ క్లస్టర్లు ఈ రంగంలో కీలకమైన సరఫరా గొలుసులో భాగంగా ఉన్నాయి.
భారతదేశ దేశీయ ఫార్మా యంత్రాల రంగం ప్రస్తుతం 810 శాతం వార్షిక వృద్ధి రేటుతో దూసుకుపోతోంది. అయితే అత్యున్నత సాంకేతికతతో కూడిన పరికరాల విభాగంలో ఇప్పటికీ దిగుమతులపైనే ఎక్కువ ఆధారపడుతోంది. ఫార్మా, మెడికల్ ల్యాబ్‌లలో ఉపయోగించే యంత్రాలతో సహా ల్యాబ్ పరికరాలు భారతీయ ఫార్మా యంత్రాల పరిశ్రమలో ఒక ముఖ్యమైన విభాగంగా ఉన్నాయి.
గత ఐదేళ్లలో ఫార్మా యంత్రాల ఎగుమతులు 15.3 శాతం వార్షిక వృద్ధి రేటును నమోదు చేయగా దిగుమతులు 10.5 శాతం వృద్ధి చెందాయి. ప్రస్తుతం ఈ రంగంలో భారత్ వాణిజ్య లోటును కలిగి ఉంది.
గత ఐదేళ్లలో ల్యాబ్ పరికరాల ఎగుమతులు 8.3 శాతం వార్షిక వృద్ధి రేటును నమోదు చేయగా దిగుమతులు 7 శాతం వృద్ధి చెందాయి. ల్యాబ్ పరికరాల విభాగంలో కూడా భారత్ వాణిజ్య లోటును ఎదుర్కొంటోంది.
ధన్యవాదాలు సమర్పించిన ఈఈపీసీ భారత్ ఉప ప్రాంతీయ చైర్మన్ అరుణ్ శుక్లా... ఉత్సాహంగా పాల్గొన్న పరిశ్రమ ప్రతినిధులు, భాగస్వాములకు కృతజ్ఞతలు తెలిపారు.

# "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక"

- **మే 18 -23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక వారోత్సవాలు**
- **బ్రోషర్‌ను ఆవిష్కరించిన మంత్రి జూపల్లి కృష్ణారావు**

హైదరాబాద్, వెలుతురు మే 15:



రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మే 18 నుంచి 23 వరకు తెలంగాణ వ్యాప్తంగా పర్యాటక వారోత్సవాలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రత్యేక బ్రోషర్‌ను పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక, భాషా సాంస్కృతిక, పురావస్తు శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్ పాల్గొన్నారు. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్ని పురస్కరించుకుని మే 18న హైదరాబాద్‌లోని స్టేట్ మ్యూజియంలో మంత్రి జూపల్లి ఈ పర్యాటక వారోత్సవాలను మధ్యాహ్నం ఘనంగా ప్రారంభించనున్నారు.
ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. తెలంగాణలో పర్యాటక రంగానికి ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేందుకు ఈ వారోత్సవాలు దోహదపడతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని చారిత్రక వారసత్వ సంపద, సంస్కృతి, ఎకోటూరిజం ప్రదేశాలను ప్రమోట్ చేయడంతో పాటు, పర్యాటక రంగం ద్వారా లభించే ఉపాధి అవకాశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని చెప్పారు.
భాషా సాంస్కృతిక శాఖ, పురావస్తు (హెరిటేజ్) శాఖ, నిథమ్ (NITHM) సంస్థల సమన్వయంతో పర్యాటక శాఖ ఈ ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందని తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా హెరిటేజ్ వాక్‌లు, పర్యాటక అవగాహన సదస్సులు, ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు, యూట్యూబర్లతో సమావేశాలు, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు.
రాష్ట్రంలో పర్యాటక రంగానికి తిరుగులేని ఆదరణ ఉందన్న మంత్రి.. ప్రపంచ ప్రసిద్ధ రామప్ప దేవాలయం, నాగార్జునసాగర్, బుద్ధవనం, ఆలంపూర్ జోగులాంబ ఆలయం, లక్నవరం చెరువు, బొగత జలపాతం, పైగా సమాధులు, రేమండ్స్ టూంబ్స్, గన్‌ఫౌండ్రీ, ఖజానా బిల్డింగ్, పానగల్ మ్యూజియంతో పాటు వరంగల్‌లోని చారిత్రక కట్టడాలు స్వదేశీ, విదేశీ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయని కొనియాడారు. మౌలిక వసతుల కల్పన, వారసత్వ సంపద పరిరక్షణ, సాంస్కృతిక పర్యాటక ప్రచారం, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో పర్యాటక రంగాన్ని సమీకృతంగా అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని స్పష్టం చేశారు.
కార్యాచరణ ప్రణాళికలో భాగంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతితో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా జానపద కళా ప్రదర్శనలు, పేరిణి, శాస్త్రీయ నృత్యాలు, సాహిత్య కార్యక్రమాలు, సంగీత కచేరీలు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.
మే 23న హైదరాబాద్‌లో "డెస్టినేషన్ తెలంగాణ: స్ట్రాటజీస్ ఫర్ ది నెక్స్ట్ ఫ్రంటియర్ ఆఫ్ టూరిజం" (Destination Telangana: Strategies for the Next Frontier of Tourism) అనే ఇతివృత్తంతో 'పర్యాటక సదస్సు (టూరిజం కాన్క్లేవ్) 2026' నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ సదస్సులో పర్యాటక రంగ భాగస్వాములు, హాస్పిటాలిటీ నిపుణులు, విధాన నిర్ణేతలు పాల్గొని తెలంగాణను దేశంలోనే అగ్రగామి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన భవిష్యత్తు వ్యూహాలపై చర్చించనున్నారని వివరించారు. 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' స్ఫూర్తితో నిర్వహించే ఈ వారోత్సవాలు తెలంగాణ పర్యాటక రంగానికి సరికొత్త కళను తీసుకువస్తాయని మంత్రి జూపల్లి ఆశాభావం వ్యక్తం చేశారు.

## గద్వాల్ విజయలక్ష్మి నాయకత్వంలో మహిళలకు మరింత బలమైన న్యాయం లభిస్తుంది

- **డా. రేఖ బోయలపల్లి ఉపాధ్యక్షురాలు, తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్**

హైదరాబాద్ వెలుతురు మే 15:



శుక్రవారం రోజున తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమితులైన శ్రీమతి గద్వాల్ విజయలక్ష్మి గారిని కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేయడం ఎంతో ఆనందంగా ఉంది.
మాజీ మేయర్‌గా పనిచేసిన గద్వాల్ విజయలక్ష్మి గారు ధైర్యసాహసాలు కలిగిన డైనమిక్ నాయకురాలు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ రాజ్యసభ సభ్యులు శ్రీ కేశవ రావు కుమార్తెగా రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన ఆమెకు మహిళా సమస్యలపై మంచి అవగాహన ఉంది. ప్రజల సమస్యలను ఎలా పరిష్కరించాలో తెలిసిన అనుభవం, పరిపాలనా నైపుణ్యం, మహిళల పట్ల ఉన్న చిత్తశుద్ధ వారిని ఈ బాధ్యతకు మరింత అర్హురాలిగా నిలబెడుతున్నాయి.
మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా ఆమె మహిళల రక్షణ, హక్కులు, న్యాయం కోసం సమర్థవంతంగా పనిచేస్తారని నాకు పూర్తి నమ్మకం ఉంది. మహిళలకు 100 శాతం న్యాయం జరిగేలా, వారి సమస్యలకు ధైర్యంగా అండగా నిలిచే నాయకత్వాన్ని వారు అందిస్తారని విశ్వసిస్తున్నాను.
ఈ కీలకమైన నిర్ణయం తీసుకున్న గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ గారికి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. బీసీ సమాజానికి ఎప్పటికప్పుడు ప్రాధాన్యత ఇస్తూ, సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తూ గొప్ప సందేశాన్ని ఇచ్చింది.

## తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు కమిటీ

హైదరాబాద్ వెలుతురు మే 15:




ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించి, వారి సేవలు-త్యాగాలను గౌరవించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ శుక్రవారం జీఓ ఆర్టీ నం.679 జారీ చేసింది. ఉద్యమంలో కొందరు ప్రాణత్యాగం చేయగా, మరికొందరు శారీరక వైకల్యానికి గురయ్యారు. పలువురిపై కేసులు నమోదై జైలు జీవితం గడిపిన నేపథ్యంలో, వారి సేవలను అధికారికంగా గుర్తించాలనే చాలాకాలంగా ఉన్న డిమాండ్‌పై ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

**కమిటీ చైర్మన్‌గా కే. కేశవరావు**

ఈ కమిటీకి ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె. కేశవరావు చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. సభ్యులుగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్సీ-విప్ అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి నియమితులయ్యారు. సాధారణ పరిపాలన శాఖ పొలిటికల్ సెక్రటరీ ఈ కమిటీకి కన్వీనర్‌గా ఉంటారు.
తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు ముందుగా స్పష్టమైన ప్రమాణాలను రూపొందించడం ఈ కమిటీ ప్రధాన బాధ్యత. ఆ ప్రమాణాల ఆధారంగా ఉద్యమకారుల జాబితాను సిద్ధం చేస్తుంది. అనంతరం వారికి ఎలాంటి గుర్తింపు, గౌరవం, సౌకర్యాలు కల్పించాలనే అంశాలపై ప్రభుత్వానికి సిఫారసులు చేస్తుంది.


**త్వరగా నివేదిక ఇవ్వాలని ఆదేశం**

కమిటీ అవసరమైతే అధికారులను పిలిపించుకోవచ్చు. సమాచారం సేకరించవచ్చు. సమావేశాలు నిర్వహించవచ్చు. అవసరమైన ఇతర వ్యక్తులు, అధికారులను కూడా సంప్రదించవచ్చు. కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి వీలైనంత త్వరగా సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, కార్యదర్శులు కమిటీకి అవసరమైన సహకారం అందించాలని ప్రభుత్వం ఆదేశించింది.



# ఆదాయం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం సమాజాన్ని పణంగా పెట్టిందా...?

## "తాగండి... ఊగండి... సావండి..." ఇదేనా ప్రజా పాలన?



తెలంగాణలో మద్యం విధానంపై ప్రస్తుతం తీవ్ర చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , డ్రగ్స్ నియంత్రణపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు తెలంగాణ ప్రజలు హర్షిస్తున్నారు. కానీ అదే సమయంలో మద్యం విక్రయాల పెరుగుదలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక వైపు డ్రగ్స్‌ను సమాజానికి ప్రమాదంగా గుర్తించి అరికట్టాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే, మరోవైపు మద్యం అందుబాటు పెరగడం విధానాల్లో విరుద్ధతగా కనిపిస్తోంది.ఇక ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం, భద్రత, జీవన ప్రమాణాలను రక్షించాల్సిన బాధ్యత కలిగిన వ్యవస్థ. కానీ అదే ప్రభుత్వం ప్రజల బలహీనతలను,ప్రత్యేకంగా మద్యం అలవాటును,ఆదాయ వనరుగా మార్చుకుంటే, అది పరిపాలనా ధర్మాన్ని ప్రశ్నించే పరిస్థితిని సృష్టిస్తుంది.

ప్రజల ఆరోగ్యం, కుటుంబ ఆర్థిక పరిస్థితులపై మద్యం ప్రభావం గణనీయంగా ఉంటుంది. ఆదాయం పెంపు కోసం మద్యం అమ్మకాలపై ఆధారపడటం తక్షణ ప్రయోజనాలు ఇచ్చినా, దీర్ఘకాలంలో సామాజిక సమస్యలను మరింత పెంచే అవకాశం ఉంది. ముఖ్యంగా యువతలో వ్యసనాలు పెరగడం, కుటుంబ విభేదాలు, ఆరోగ్య సమస్యలు వంటి అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇక

తెలంగాణలో అమలవుతున్న మద్యం విధానం ఈ సంక్లిష్ట వాస్తవాన్ని బహిర్గతం చేస్తోంది.

ప్రభుత్వ ఆదాయంలో మద్యం విక్రయాల పాత్ర గణనీయంగా పెరుగుతోంది. ఇక ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలిసారిగా ఎక్సైజ్ శాఖలో రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిగినట్టు ఆబ్కా ఆబ్కారీ శాఖ వెల్లడించింది. 202526 ఆర్థిక సంవత్సరంలో రూ.40.209 కోట్ల అమ్మకాలు జరగగా.. గత ఏడేండ్లలో పోలిస్తే రెట్టింపు స్థాయి అమ్మకాలు జరిగినట్లు ఎర్నైజ్ శాఖ అధికా రులు వెల్లడించారు. 2024 25 ఆర్థిక సంవత్సరంలో రూ.37,487 కోట్ల మద్యం అమ్మకాలు జరగగా.. 202526లో గతేడాదితో పోలిస్తే రూ.2,722 కోట్ల మద్యం అమ్మకాలు అదనంగా పెరిగాయని ఆబ్కారీ శాఖ తెలిపింది.ఇక తెలంగాణ రాష్ట్రంలో తీవ్ర వేసవి వేడి, ఒక ప్రక్కన ఐపీఎల్ క్రికెట్ ఉత్సాహం, పెళ్లిళ్ల సీజన్, అన్ని కలిసివచ్చి బీర్ల అమ్మకాలను రికార్డు స్థాయికి చేర్చాయి. చల్లని బీర్ల కోసం వైన్ షాపుల ముందు ప్రజలు క్యూలు కడుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలోనే సుమారు 50.05 లక్షల కేసులు (దాదాపు 6 కోట్ల బీర్లు) అమ్ముడయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే గణనీయమైన వృద్ధి నమోదైంది. మార్చి నెలలో కూడా అమ్మకాలు భారీగా పెరిగి 50.78 లక్షల కేసులకు చేరాయి.ఐపీఎల్ మ్యాచ్‌లతో వినియోగం పెరగడం, పెళ్లిళ్ల వేడుకలు,కలిసి అమ్మకాలను మరింత పెంచుతున్నాయి. దీంతో ప్రభుత్వానికి భారీ ఆదాయం వస్తోంది.

ఇది ఆర్థిక పరంగా ప్రభుత్వానికి తక్షణ లాభాలను అందించినప్పటికీ, దీని సామాజిక వ్యయం మరింత భారంగా మారుతోంది. కుటుంబాల ఆర్థిక స్థితి క్షీణించడం, గృహహింస పెరగడం, ఆరోగ్య సమస్యలు తీవ్రతరమవడం వంటి పరిణామాలు గ్రామాల నుంచి నగరాల వరకు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో "రెవెన్యూ" పేరుతో ప్రజల బాధను మూలధనంగా మార్చడం నైతికంగా సమర్థించగలమా అనే ప్రశ్న తలెత్తుతుంది.

ప్రభుత్వం ఒక వైపు సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు సహాయం చేస్తూ, మరో వైపు మద్యం ద్వారా అదే ప్రజల నుంచి డబ్బును వసూలు చేయడం ద్వంద్వ ధోరణిగా కనిపిస్తుంది. ఇది ఒక చేతితో ఇస్తూ, మరో చేతితో తీసుకునే విధానంగా మారుతోంది. దీర్ఘకాలంలో ఇది సమాజాన్ని బలహీనపరచే ప్రమాదం ఉంది.

అందువల్ల, మద్యం విధానంలో సమతుల్యత అత్యవసరం. ఆదాయం మాత్రమే లక్ష్యంగా కాకుండా, ప్రజల ఆరోగ్యం, సామాజిక స్థిరత్వం ప్రధాన ప్రమాణాలుగా ఉండాలి. కఠిన నియంత్రణలు, అవగాహన కార్యక్రమాలు, డీఅడిక్షన్ సదుపాయాలు పెంపు వంటి చర్యలు తీసుకోవాలి. లేకపోతే, ఇది పరిపాలన కాదు——ప్రజల బలహీనతలపై ఆధారపడిన వ్యవస్థీకృత దోపిడీగా మిగిలిపోతుంది. ఇకచట్టం ఒక వైపు, వాస్తవం మరో వైపు పరుగులు తీస్తున్న రాష్ట్రంగా తెలంగాణ మారుతోందనే విమర్శలు యాదృచ్ఛికం కావు. "Telangana Excise Act, 1968" కాగితాలపై ఎంత కఠినంగా కనిపించినా, నేలమీద అది కేవలం ఒక నాటకంగా మిగిలిపోతోందనే అభిప్రాయం బలపడుతోంది. పర్మిట్ రూములు నియంత్రిత వినియోగ కేంద్రాలు కావాలి. కానీ వాస్తవం ఏమిటి? అవి పూర్తిస్థాయి బార్‌లుగా మారాయి. టేబుల్స్, కుర్చీలు, స్నాక్స్, గంటల తరబడి కూర్చునే వినియోగదారులు, ఇది చట్టం కాదు, ఇది చట్టానికి సవాలు. ప్రశ్న స్పష్టం, ఇది అధికారులకు కనిపించడం లేదా? లేక చూడకపోవడమే వారి విధానమా?ఇక్కడే అసలు రాజకీయ ప్రశ్న మొదలవుతుంది.రాష్ట్ర ఖజానా నింపడానికి మద్యం అమ్మకాలు ప్రధాన ఆయుధంగా మారాయి. వేల కోట్ల రూపాయల ఆదాయం వస్తోంది. కానీ ఈ ఆదాయం ఎక్కడి నుంచి వస్తోంది? కార్పొరేట్ లాభాల నుంచి కాదు, పేదల జేబుల నుంచి. రోజువారీ కూలీ, చిన్న ఉద్యోగి, రైతు, ఇవే మద్యం మార్కెట్‌కు ప్రధాన వినియోగదారులు. అంటే, పేదల బలహీనత ప్రభుత్వానికి బలంగా మారిందా?"తాగు-ఊగు-సావు" అనే మాట ఇప్పుడు సామెత కాదు——ఇది పాలనా తత్వంగా మారుతోందా?గ్రామీణ తెలంగాణ పరిస్థితి మరింత భయంకరం. ప్రతి పల్లెలో, ప్రతి వీధిలో బెల్టు షాపులు విస్తరించాయి. అనుమతులు లేవు. నియంత్రణ లేదు. కానీ వ్యాపారం మాత్రం బహిరంగంగా సాగుతోంది. ఉదయం పాలు అమ్మినట్టే మద్యం అమ్మకం జరుగుతోంది. అర్ధరాత్రి తలుపు తట్టినా మద్యం దొరుకుతోంది. ఇది చట్టం వైఫల్యమా? లేక ఉద్దేశపూర్వక మౌనమా?బెల్టు షాపుల్లో ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. క్వార్టర్ బాటిల్‌పై రూ.40 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. బీరు బాటిల్‌కు రూ.50 వరకు అధిక ధర. ఇది కేవలం వ్యాపార దందా కాదు, ఇది ప్రజల దోపిడీ. ఈ దోపిడీకి బాధ్యులు ఎవరు? వ్యాపారులా? లేక పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు?ఇక్కడ మరో తీవ్రమైన ఆరోపణ వినిపిస్తోంది, మామూళ్లు. నెలవారీ లావాదేవీలు. అధికారుల మౌనం. పోలీసుల నిర్లక్ష్యం. ఇవన్నీ కలిపి ఒక "సిస్టమ్" గా మారిపోయాయనే భావన ప్రజల్లో బలపడుతోంది. ఇది నిజమా కాదా అనేది విచారణ విషయం. కానీ ప్రజల్లో ఈ అనుమానం పెరగడం కూడా ప్రభుత్వానికి ప్రమాదసంకేతం.ఇప్పుడుముఖ్యమైనప్రశ్న, ప్రభుత్వం నిజంగా నియంత్రించాలనుకుంటుందా?

నియంత్రించాలంటే సాధ్యం కాదు అనే కారణం లేదు. సాంకేతిక పర్యవేక్షణ ఉంది. చట్టపరమైన అధికారం ఉంది. కానీ అమలు లేదు. ఎందుకు? ఇదే అసలు ప్రశ్న.సమాధానం ఒకటే అనిపిస్తోంది——ఆదాయం.

మద్యం ఆదాయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కీలకం. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు,ఇవి అన్నీ ఈ ఆదాయంపై ఆధారపడి ఉన్నాయనే వాదన ఉంది. కానీ ఇది ఒక ప్రమాదకరమైన మార్గం. ఎందుకంటే ఇది ప్రభుత్వాన్ని ఒక నైతిక సంక్షోభంలోకి నెడుతుంది.ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కాపాడాలా? లేక వారి వ్యసనాల నుంచి ఆదాయం పొందాలా?ఈ రెండు లక్ష్యాలు ఒకేసారి సాధ్యం కావు.ప్రజాస్వామ్యంలో చట్టాలు కేవలం పుస్తకాలలో ఉండటానికి కాదు——సమాజాన్ని క్రమబద్ధంగా, ఆరోగ్యకరంగా నడిపించడానికి. కానీ తెలంగాణలో పర్మిట్ రూముల వాస్తవ పరిస్థితి చూస్తే, చట్టం ఒక వైపు, అమలు మరో వైపు నడుస్తున్న ద్వంద్వ వ్యవస్థ స్పష్టంగా కనిపిస్తోంది.

Telangana Excise Act ప్రకారం పర్మిట్ రూమ్ అనేది కేవలం నియంత్రిత స్థలంలో మద్యం సేవించేందుకు మాత్రమే అనుమతించబడింది. కూర్చునే సదుపాయాలు ఉండకూడదు, వంట చేయకూడదు, రెస్టారెంట్‌లా నడపకూడదు——ఇవి స్పష్టమైన నిబంధనలు. కానీ భూమిపై వాస్తవం ఏమిటి? చాలా చోట్ల పర్మిట్ రూములు చిన్న బార్లుగా మారిపోయాయి. టేబుల్స్, కుర్చీలు, ఫుల్ ఫుడ్ మెనూలు, గంటల తరబడి కూర్చుని మద్యం సేవించే వాతావరణం——ఇది చట్టం అనుమతించినది కాదు, కానీ వ్యవస్థ సహిస్తున్నది.

ఇక్కడ అసలు ప్రశ్న చట్ట ఉల్లంఘన కాదు——అమలులో ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం. ప్రభుత్వం కఠినంగా అమలు చేయగలిగే చట్టాన్ని సడలించడం ఎందుకు? సమాధానం స్పష్టమే——ఆదాయం. మద్యం విక్రయాలు పెరిగితే ఖజానా నిండుతుంది. పర్మిట్ రూములు ఎక్కువ సమయం కస్టమర్‌ను నిలిపి ఉంచితే, వినియోగం పెరుగుతుంది. అంటే చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేస్తే ఆదాయం తగ్గే ప్రమాదం ఉంది. అందుకే నియమాలు ఉన్నా, అమలు సగం మాత్రమే.ఇది ప్రజాస్వామ్య పరిపాలనలో ప్రమాదకరమైన ధోరణి. ఒక వైపు ప్రభుత్వం "నియంత్రణ" పేరుతో చట్టాలు చేస్తుంది, మరో వైపు అదే చట్టాలను మౌనంగా బలహీనపరుస్తుంది. ఫలితం——ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుంది, కుటుంబాలు ఆర్థికంగా క్షీణిస్తాయి, కానీ ప్రభుత్వానికి మాత్రం ఆదాయం పెరుగుతుంది.ఇది పరిపాలనా విఫలం మాత్రమే కాదు——నైతిక వైఫల్యం కూడా. చట్టం ఒక రూపం, అమలు మరో రూపం అయితే ప్రజాస్వామ్యం నమ్మకం కోల్పోతుంది. కాబట్టి, తెలంగాణలో పర్మిట్ రూముల వ్యవస్థపై నిజమైన సంస్కరణ అవసరం——లేదంటే ఇది నియంత్రణ కాదు, చట్టబద్ధమైన పేరుతో జరుగుతున్న వ్యవస్థీకృత దోపిడీగా మిగిలిపోతుంది.

ఇది దీర్ఘకాలంలో ప్రజా ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది. కుటుంబాలు విరిగిపోతున్నాయి. మహిళలు బాధపడుతున్నారు. యువత వ్యసనాలకు బలవుతోంది. ఇవన్నీ తెలిసినా వ్యవస్థ ఎందుకు మౌనంగా ఉంది ?ఇది కేవలం పరిపాలనా వైఫల్యం కాదు, ఇది ఒక విధాన వైఫల్యం.ఇప్పుడు ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చింది. చట్టాన్ని అమలు చేస్తారా? లేక ఆదాయం కోసం చట్టాన్ని పక్కన పెడతారా?ఈ రెండు మధ్య రాజీ సాధ్యం కాదు.పరిష్కారం కూడా స్పష్టమే——కానీ అమలు చేయాలనే సంకల్పం అవసరం. పర్మిట్ రూములపై కఠిన నియంత్రణలు అమలు చేయాలి. బెల్టు షాపులను పూర్తిగా నిర్మూలించాలి. ఎమ్మార్పీ ఉల్లంఘనలకు తక్షణ చర్యలు తీసుకోవాలి. అధికారుల బాధ్యతను ఖరారు చేయాలి. పారదర్శకతను పెంచాలి. అయితే ఇవన్నీ మాటల్లో కాదు——చర్యల్లో కనిపించాలి.లేకపోతే, "చట్టం" అనే పదం కేవలం పుస్తకాలలో మిగిలిపోతుంది. "ప్రజాస్వామ్యం" అనే విలువ కేవలం నినాదంగా మారిపోతుంది. తెలంగాణ ఇప్పుడు ఒక కీలక మలుపులో ఉంది. ప్రభుత్వం ప్రజల పక్షాన నిలుస్తుందా?

లేక ఆదాయం కోసం సమాజాన్ని పణంగా పెడుతుందా?ఈ ప్రశ్నకు సమాధానం ఆలస్యం అయితే, నష్టం కేవలం ఆర్థికంగా కాదు,సామాజికంగా, నైతికంగా, రాజకీయంగా కూడా తిరిగి పూడ్చలేనిది అవుతుంది అనేది పాలకులు గుర్తు ఎరగాలి.



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

# పెట్రో భారంతో ప్రజల జీవితాలపై మళ్లీ మోత

దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను మరోసారి పెంచిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయం సామాన్య ప్రజల ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇప్పటికే పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్ సిలిండర్ రేట్లు, విద్యుత్ ఛార్జీలతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు తాజా ఇంధన ధరల పెంపు మరింత భారంగా మారింది. పెట్రో ధరల పెరుగుదల అనేది కేవలం వాహనదారుల సమస్య మాత్రమే కాదు; అది దేశ ఆర్థిక వ్యవస్థ మొత్తం మీద ప్రభావం చూపే అంశంగా మారింది.

ఇంధన ధరలు పెరిగిన ప్రతిసారీ దాని ప్రభావం రవాణా రంగంపై ముందుగా పడుతుంది. రవాణా ఖర్చులు పెరగడం వల్ల మార్కెట్‌లోని ప్రతి వస్తువు ధర కూడా క్రమంగా పెరుగుతుంది. కూరగాయల నుంచి నిర్మాణ సామగ్రి వరకు, పాల నుంచి ధాన్యం వరకు ప్రతి వస్తువుపై అదనపు ధరల భారం పడుతుంది. చివరకు వినియోగదారుడైన సామాన్యుడే దీనికి మూల్యం చెల్లించాల్సి వస్తుంది.

ఇటీవల అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు గణనీయంగా తగ్గుతున్నప్పటికీ దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గకపోవడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది. ప్రపంచ మార్కెట్‌లో ధరలు పెరిగినప్పుడు వెంటనే దేశీయ ధరలు పెంచే కేంద్ర ప్రభుత్వం, అదే ధరలు తగ్గినప్పుడు ప్రజలకు ఉపశమనం కల్పించడంలో మాత్రం ఆసక్తి చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంధన ధరల నిర్ణయంలో పారదర్శకత లేదన్న భావన కూడా ప్రజల్లో బలపడుతోంది.

పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర ఎక్సైజ్ సుంకాలు, వివిధ రకాల పన్నులు ప్రధాన కారణమని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ పన్నుల రూపంలో భారీ ఆదాయం పొందుతున్నప్పటికీ ప్రజలకు మాత్రం తగ్గింపు ప్రయోజనం అందడం లేదు. పెట్రోల్, డీజిల్ ధరల్లో అసలు ఇంధన ధర కంటే పన్నుల వాటానే అధికంగా ఉండటం ప్రజల్లో ఆగ్రహానికి దారితీస్తోంది.

ఇప్పటికే ద్రవ్యోల్బణం కారణంగా మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఉద్యోగుల జీతాలు పెరగకపోయినా ఖర్చులు మాత్రం నిరంతరం పెరుగుతున్నాయి. పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, ఇంటి అద్దెలు, కరెంటు బిల్లులు, నిత్యావసర అవసరాలన్నీ కలిపి కుటుంబాల ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నాయి. ఇలాంటి సమయంలో ఇంధన ధరల పెంపు ప్రజల జీవన ప్రమాణాలను మరింత దిగజార్చే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

పెట్రో ధరల పెంపు ప్రభావం ఎక్కువగా రైతాంగంపై పడుతోంది. డీజిల్ ఆధారిత వ్యవసాయ పరికరాల వినియోగం అధికంగా



ఉన్న దేశంలో డీజిల్ ధరల పెరుగుదల సాగు ఖర్చులను భారీగా పెంచుతోంది. ట్రాక్టర్లు, మోటార్లు, కోత యంత్రాలు, సరుకు రవాణా వాహనాలన్నీ డీజిల్‌పైనే ఆధారపడుతున్నాయి. ఇప్పటికే ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల ధరలతో ఇబ్బంది పడుతున్న రైతులకు ఇది అదనపు భారంగా మారింది.

చిన్న వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు, లారీ యజమానులు కూడా ఇంధన ధరల పెరుగుదలతో తీవ్రంగా ప్రభావితమవుతున్నారు. రోజువారీ ఆదాయంపై ఆధారపడే వర్గాలకు పెరుగుతున్న ఇంధన వ్యయం నేరుగా జీవనోపాధిపై ప్రభావం చూపుతోంది. ఆటో ఛార్జీలు పెంచితే ప్రయాణికులు తగ్గిపోతారు; పెంచకపోతే డ్రైవర్లకు నష్టాలు తప్పవు. ఇదే పరిస్థితి చిన్న రవాణా వ్యాపారులకూ ఎదురవుతోంది.

కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కంటే ఆదాయ వనరుల పెంపుపైనే ఎక్కువ దృష్టి పెట్టిందన్న విమర్శలు రాజకీయ వర్గాల నుంచి వస్తున్నాయి. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలకు భిన్నంగా ప్రస్తుతం అమలు చేస్తున్న విధానాలు ఉన్నాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ముఖ్యంగా కార్పొరేట్ సంస్థలకు అనుకూల విధానాలు అమలు చేస్తూనే సామాన్యులపై పన్నుల భారం మోపుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దేశ ఆర్థిక వ్యవస్థలో ఇంధన ధరలు కీలక పాత్ర పోషిస్తాయి. ఇంధన ధరలు పెరిగితే ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. పరిశ్రమలపై అదనపు భారం పడుతుంది. దాని ప్రభావం చివరకు వినియోగదారుడిపైనే పడుతుంది. అందుకే ఇంధన ధరల నియంత్రణ ప్రభుత్వాలకు అత్యంత బాధ్యతాయుతమైన అంశంగా పరిగణించబడుతుంది.

ప్రస్తుతం దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతల మధ్య సామాన్య ప్రజలకు ఊరటనిచ్చే నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. పెట్రోల్, డీజిల్‌పై పన్నులను తగ్గించడం ద్వారా ప్రజలకు కొంత ఉపశమనం కల్పించే అవకాశం ఉందని చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు తగ్గుతున్న సందర్భాన్ని ఉపయోగించుకుని దేశీయ ధరలను తగ్గిస్తే ద్రవ్యోల్బణ నియంత్రణకూ దోహదపడుతుందని అభిప్రాయపడుతున్నారు.

ప్రజల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఇంధన ధరల పెంపు వల్ల ఏర్పడే ప్రభావం కేవలం ఒక వర్గంపైనే కాదు, సమాజంలోని ప్రతి కుటుంబంపైనా పడుతుంది. అందుకే పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించి సామాన్య ప్రజలకు ఉపశమనం కల్పించాలన్న డిమాండ్ దేశవ్యాప్తంగా బలపడుతోంది.

ప్రజల జీవన వ్యయాన్ని తగ్గించే చర్యలు తీసుకోవడం ఏ ప్రభుత్వానికైనా ప్రాధాన్య కర్తవ్యమే. పెరుగుతున్న ధరలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఊరటనిచ్చే నిర్ణయాలు తీసుకుంటేనే ప్రభుత్వాలపై విశ్వాసం పెరుగుతుంది. లేకపోతే పెరుగుతున్న అసంతృప్తి రాజకీయంగానూ ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



కొప్పుల ప్రవీణ్ కుమార్
టీపీసీసీ జనరల్ సెక్రటరీ

# కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి సంక్షేమ పథకం ప్రజలకు వివరించాలి

- **ప్రజలతో మమేకం కావాలి**
- **రాబోయే ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎన్నికలకు సిద్ధం కావాలి**
- **కాంగ్రెస్ పార్టీ ఆరుట్ల గ్రామశాఖ అధ్యక్షుడు నూకం బాలరాజ్ ముదిరాజ్, కార్యదర్శి చిందం శ్రీశైలం**



మంచాల వెలుతురు మే15:

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం గ్రామశాఖ అధ్యక్షుడు నూకం బాలరాజ్ ముదిరాజ్ కార్యదర్శి చిందం శ్రీశైలంఆధ్వర్యంలో జరి గింది ఈసమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ గ్రామంలోని వివిధ సమస్యలు గ్రామ శాఖ దృష్టికి తీసుకువచ్చారు అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని అన్నారు ఎలాంటి విభేదాలు లేకుండా పార్టీ బలోపేతం కోసం అందరూ కలిసికట్టుగా ఐక్యంగా కృషి చే యాలని గ్రామశాఖ దృష్టికి తీసుకువచ్చారు ఈ సందర్భంగా గ్రామశాఖ అధ్యక్షుడు నూకం బాలరా జ్ ముదిరాజ్ కార్యదర్శి చిందం శ్రీశైలం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంచేపట్టాక ఇబ్రహింప ట్నం ఎమ్మెల్యేమల్ రెడ్డి రంగారెడ్డి గారి సహకారంతో గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరిగా యో మన ప్రభుత్వం ప్రజలకోసం ఎలాంటి సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేసి పేద ప్రజల ను ఆదుకుంటుందో ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించి కాంగ్రెస్ ప్రభుత్వ చేస్తున్న ప్రజాపాలన గు రించి ప్రచారం చేయాలన్నారు అర్హులైన ప్రతిపేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా ప్రతి కాంగ్రెస్ నాయకుడు ప్రతి కార్యకర్త కృషి చేయాలి ప్రజలతో మమేకమై ప్రజల సమస్యలు తెలుసు కొని అధి కారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించేలా పని చేయాలి అన్నారు అప్పుడే మన కాంగ్రెస్ పార్టీ పైన ప్రజలకు నమ్మకం ఉంటుంది అని అన్నారు పార్టీలో ఇలాంటి విభేదాలు లే కుండా అందరూ ఐక్యంగా ఉండి పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలి రాబోయే ఎంపిటిసి జడ్పిటి సి ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎన్నికల్లో పనిచేయడానికి కాంగ్రెస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలి అని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఆరుట్ల మాజీ ఎంపీటీసీ కావాలి శ్రీనివాస్ ముదిరాజ్ గ్రామపం చాయతీ వార్డు సభ్యుడు అనంగల్ల జగన్నాథం మంచాల మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రావుల రాఘవ ఇందిరమ్మ కమిటీ సభ్యులు కంబాలపల్లి బుగ్గరాములు బుట్టి కృష్ణ ముదిరాజ్ కోరే బాబు ఆరుట్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బుడిగల పరమేష్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రావుల భాష గుడ్డిమల్ల చంద్రయ్య ముదిరాజ్ వెదిరె రమణారెడ్డి అంతటి రాజుగౌడ్ దాసరమోని రమేష్ ముదిరాజ్ ఉదరీ నరసింహ మారసురేష్ నాయకులు మహమ్మద్ గలాబ్ తలారి కృష్ణ ముదిరాజ్ సుంకరి ప్రవీణ్ గౌడ్ ఎన్నుదుల సురేష్ పంబాల కిషోర్ కోరే శ్రీనివాస్ లచ్చగారి జంగారెడ్డి చీ మర్ల గణేష్ ఆమంచ జగన్ మహమ్మద్ అశ్రవ్ గౌరిగే కృష్ణ తదితరులు పాల్గొన్నారు

# ఆర్థిక, ఆరోగ్య భద్రతనిచ్చేది సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ

కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి మే 15:




అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేయించిన ఎల్ఓసీ పత్రాలను గురువారం చింతల్ లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయా డివిజన్లకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు లబ్దిదారులకు అందజేశారు.

**ఎల్వోసీ పత్రాల అందజేతలో భాగంగా...**

సిఎంసి నిజాంపేట్ సర్కిల్ ప్రగతి నగర్ డివిజన్ కు చెందిన చోళ్ళేటి క్రిష్ణా చారి తండ్రి చోళ్ళేటి ఉపేంద్ర చారి కు రూ.1,00,000/ (ఒక లక్ష) మంజూరు కాగా... బాచుపల్లి డివిజన్ మాదేరి పద్మ భర్త మాదేరి కృష్ణ రూ.1,75,000/(ఒక లక్షా డెబ్బై ఐదు వేల రూపాయలు) మంజూరు కాగా...125 గాజుల రామారం డివిజన్ కు చెందిన షేక్ రిజ్వాన్ తండ్రి షేక్ హాసన్ కు రూ.1,00,000/ (ఒక లక్ష రూపాయలు) మంజూరు కాగా ఎల్వోసీ పత్రాలను ఆయా డివిజన్లకు చెందిన నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మాజీ డిప్యూటీ మేయర్ ధన్ రాజ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ రవి కిరణ్, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, నాయకులు అడ్వకేట్ కమలాకర్, ఇబ్రహీం ఖాన్, బొబ్బ శ్రీనివాస్, శివా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో ప్రజలపై భారం

- **కేంద్ర ప్రభుత్వ తీరుపై సీపీఎం ఆగ్రహం.. బాలానగర్, భరత్‌నగర్‌లలో భారీ నిరసనలు**




కూకట్ పల్లి మే 15 వెలుతురు:

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను వరుసగా పెంచుతూ పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలను సంక్షోభంలోకి నెట్టేస్తోందని సీపీఎం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఐలాపురం రాజశేఖర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. లీటరుకు రూ.3 చొప్పున ఇంధన ధరలు పెంచడాన్ని నిరసిస్తూ శుక్రవారం బాలానగర్‌లోని సీపీఎం కార్యాలయం వద్ద, అలాగే భరత్‌నగర్ ప్రాంతంలో పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్న వేళ ఇంధన ధరల పెంపు సామాన్య ప్రజలపై మరింత భారంగా మారిందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో రవాణా ఖర్చులు పెరిగి, అన్ని వస్తువుల ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల వరకు ధరల పెంపు ఉండదంటూ ప్రజలను తప్పుదోవ పట్టించిన కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల ఫలితాల అనంతరం ఒక్కసారిగా ధరలు పెంచడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. దేశ పరిస్థితులు, అంతర్జాతీయ యుద్ధాల పేరుతో సాకులు చెబుతూ చమురు కంపెనీలకు లాభాలు చేకూర్చేందుకు కేంద్రం పనిచేస్తోందని ఆరోపించారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా విధానాలు అమలు చేస్తూ, సామాన్య ప్రజలపై పన్నుల భారం మోపడం బీజేపీ ప్రభుత్వ అసలు స్వరూపమని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం పన్నులు తగ్గించి ఉంటే ప్రజలకు కొంత ఉపశమనం లభించేదని పేర్కొన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసిన సీపీఎం నాయకులు, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజా పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజి, కమల్, లక్ష్మి, రాజు, శ్రీను తదితరులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ఆందోళన నిర్వహించారు.

# ఘనంగా జనగీతిక పుస్తకావిష్కరణ

- **లోకకవి డాక్టర్ అందెశ్రీ స్మృతికి 67 మంది కవుల అక్షరాంజలి....**



కూకట్ పల్లి మే 15 వెలుతురు:

లోకకవి డాక్టర్ అందెశ్రీ సాహిత్య సేవలను స్మరించుకుంటూ 67 మంది కవులు రచించిన కవితా సంకలనం 'జనగీతిక' పుస్తకాన్ని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి శుక్రవారం ఘనంగా ఆవిష్కరించారు. సాహిత్య, సాంస్కృతిక వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమం కవులు, రచయితలు, కళాకారుల సమక్షంలో విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారథి ఏవో డాక్టర్ పి విజయ్ కుమార్ 'జనగీతిక' సంకలన సంపాదకులు డాక్టర్ తిరునగరి శ్రీనివాస్, తొలి ప్రతి స్వీకర్త ప్రముఖ కవి రేడియం, సినీ గేయ రచయిత మౌనశ్రీ మాలిక్, సినీ దర్శకులు నామల రవీంద్ర సూరి, ప్రముఖ గాయకులు దేవత సుధాకర్, కవి-రచయిత మిద్దె సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ అందెశ్రీ సాహిత్యం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిందని పేర్కొన్నారు. అలాంటి మహోన్నత కవిని స్మరిస్తూ కవులు అక్షరాంజలిగా ఈ సంకలనాన్ని వెలువరించడం అభినందనీయమని కొనియాడారు. 'జనగీతిక'లోని కవితలు అందెశ్రీ ఆలోచనా ప్రపంచాన్ని, ప్రజాస్వామ్య భావజాలాన్ని ప్రతిబింబిస్తున్నాయని ఆయన అన్నారు.

# ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ చొరవతో వివేకానంద నగర్ సర్వీస్ రోడ్డు పనులకు మోక్షం : పురేందర్ రెడ్డి



కూకట్ పల్లి మే 15 వెలుతురు:

శేర్లింగంపల్లి నియోజకవర్గం, వివేకానంద నగర్ డివిజన్‌లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రోడ్డు పనులను వేగవంతం చేసేందుకు పిఎసి చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ప్రత్యేక చొరవ చూపుతున్నారని రామకృష్ణ వీధి అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి అన్నారు. సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నుంచి వివేకానంద చౌరస్తా వరకు ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణానికి ఎదురవుతున్న అడ్డంకులను తొలగించేందుకు శుక్రవారం ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులు, విద్యుత్ శాఖ ఏఈ చైతన్య, ట్రాఫిక్ సీఐ, సిబ్బంది తో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ, స్థానిక ప్రజల ప్రయాణ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ సర్వీస్ రోడ్డును త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్, విద్యుత్, ట్రాఫిక్ శాఖ అధికారులను ఆదేశించారు. రోడ్డు విస్తరణకు ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, నేమ్ బోర్డులు, అలాగే రోడ్డుపైకి వచ్చిన షెడ్లను తక్షణమే తొలగించాలని సూచించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు స్పందించిన పురేందర్ రెడ్డి, స్థానిక వ్యాపారులు తమ పూర్తి సహకారాన్ని ప్రకటించారు. రోడ్డు పనుల కోసం తమ దుకాణాల ముందు ఉన్న బోర్డులు, పైపులను స్వచ్ఛందంగా తొలగించుకుంటామని, అభివృద్ధికి తాము సిద్ధమని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఈ రోడ్డు పనులను నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ కమిటీ సభ్యులు జి. నర్సింగ్ రావు, లక్ష్మీనారాయణ, కిషోర్, జి. ప్రసాద్, వెంకటేశ్వరరావు, కె.వి. రావు, కొండారెడ్డి, డి. వెంకటేశం తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి, పెండింగ్ రోడ్డు పనులను పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## బహదూర్ పల్లిలో చెరువులు, కుంటలు కబ్జాలకు గురై కనుమరుగవుతుంటే అధికారులు పట్టించుకోరా???




- **హైడ్రాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి: సాదు యాదవ్**

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మే 15:

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బహదూర్ పల్లి డివిజన్ పరిధిలోని బొబ్బఖాన్ చెరువు, సందయ్య కుంట, ఫిర్దాది కుంట నేరెళ్ల కుంట (మల్లన్న కుంట) క్రమంగా కబ్జాల గురై కనుమరుగవుతున్నాయని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోరా? అని స్థానిక కాంగ్రెస్ నాయకుడు సాదు యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం చెరువులు, కుంటలు కబ్జాకు గురి కావడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి ప్రజలు తాగునీటి కోసం ట్యాంకర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుంది.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భవిష్యత్తు తరాలకు చెరువులు కుంటలు నాలాలను కబ్జాలకు గురికాకుండా వాటి పరిరక్షణ కోసం హైడ్రా వంటి సంస్థను ఏర్పాటు ఏర్పాటు చేయడం జరిగింది. గత ప్రభుత్వం (బిఆర్ఎస్) పార్టీ స్థానిక నాయకుల కనుసన్నల్లోనే చెరువులు కుంటలు కబ్జాలకు గురవుతున్నాయి. దీనికి తోడు అధికారులు మాత్రం" డోంట్ కేర్ అంటూ వ్యవహరిస్తున్నారు.
చెరువులు కుంటలు కాపాడాల్సిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు మౌనం ఎందుకు వహిస్తున్నారు. గత వర్షాకాలంలో అధికారుల నిర్లక్ష్యం వల్లనే చాలా కాలనీలు ముంపుకు గురయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులు కుంటల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించి వాటిని పునరుద్ధరించాలని కబ్జాల్లో ఉన్న కుంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. కాపాడాల్సిన వ్యక్తులే కబ్జాల పాల్పడుతున్నారని ఆరోపించారు.

## ఇంధన ధరల పెంపు సామాన్యుల పాలిట మోదీ సర్కార్ నిర్ణయాలు శాపంగా మారాయి

- **దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వ అవసరం గుర్తుకొస్తుందన్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**



ఇబ్రహీంపట్నం వెలుతురు మే 15:

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూపేదల సంక్షేమం మరిచి,అడుగడుగునా ఆర్థికంగా అణిచివేసే విధంగానే పదేళ్ల మోదీపాలన ఉందని వి మర్శించారు మత విద్వేషాలు జాతీయవాదంతో ఎన్నికల్లో నెగ్గి తర్వాత పేదలపాలిట శాపంగా మారారని ఆరోపించారు బంగారం కొనుగోలు ఆపేయాలని ఖర్చులు తగ్గించాలని వాహనాలు వా డవద్దంటూ జాతిని కోరుతున్న ప్రధాని దీనికి కారణం ఎవరో సమాధానం చెప్పాలని డిమాండ్ చే శారు 3దశాబ్దాల క్రితం ఆర్థిక సంక్షోభ పరిస్థితుల్లో పీవీ మన్మోహన్ సింగ్ తీసుకున్న విప్లవాత్మక ని ర్ణయాలే నేడు దేశాన్ని నడిపిస్తున్నాయని సరైన నిర్ణయాలు తీసుకోవటంలో మోదీసర్కార్ వైఫల్య మే నేటి ఆర్థిక విపత్తులకు కారణమన్నారు ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలవేళ మౌనంగా ఉండి పూర్తైన వెంటనే పెట్రోల్ డీజీల్ ధరలు పెంచటం ప్రజలను వంచించటమేనని విమర్శించారు. దేశంలో నేడు నెలకొన్న పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ అవసరాన్ని గుర్తుచేస్తుందని చెప్పారు యూపీఏ హయాం లో తెచ్చిన ఉపాధిహామీ పథకంలాంటి వాటిని నిర్వీర్యం చేసి రాష్ట్రాలపై ఇప్పటికే పెనుభారం మో పటమే కాకుండా పేదప్రజల సంక్షే మాన్ని విస్మరించి కార్పొరేట్లకు వంతపాడుతున్నారని ఆరోపిం చారు దేశంలోరాష్ట్రంలో కాంగ్రెస్ ఉంటేనే ప్రజలకు సరైన పాలన అందుతుందని అన్నారు

## వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు..

కూకట్ పల్లి, మే 15 వెలుతురు:




వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు ఉపశమనం కలిగించే లక్ష్యంతో వివేకానంద నగర్ డివిజన్‌లోని సప్తగిరి కాలనీ రామాలయం దేవాలయం సమీపంలో ఎంసీఆర్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఎంసీఆర్ కాంప్లెక్స్ అధ్యక్షులు అభిలాష్ రెడ్డి-స్వాతి దంపతులు ప్రజలకు మంచినీరు, మజ్జిగతో పాటు పండ్లు పంపిణీ చేసి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి హాజరై చలివేంద్రం వద్దకు వచ్చిన ప్రజలకు స్వయంగా మజ్జిగ, పండ్లు, మంచినీరు అందజేశారు. ఈ సందర్భంగా పురేందర్ రెడ్డి మాట్లాడుతూ, వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందుకొచ్చిన అభిలాష్ రెడ్డి దంపతులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి సంవత్సరం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంసీఆర్ కాంప్లెక్స్ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, జయలక్ష్మి, స్వాతి, శివప్రసాద్, రవిరెడ్డి, సురేష్ బాబు, శ్రావణి, కమిటీ సభ్యులు జీ ప్రసాద్, లక్ష్మీనారాయణ, కొండారెడ్డి, వై.వి. రావు, నర్సింగ్ రావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఆరుట్ల గ్రామంలో ఇటీవల మరణించిన నూతన గంటి రాకేష్ కుటుంబ సభ్యులను ఓదార్చిన రంగారెడ్డి జిల్లా బి అర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి

మంచాల వెలుతురు మే15:



మంచాల మండలంలోని ఆరుట్ల గ్రామంలో నూతన గంటి లక్ష్మయ్య కుమారుడు నూతనగంటి రా కేష్ మరణించిన విషయం తెలుసుకున్న రంగారెడ్డి జిల్లా బిఅర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ఎమ్మె ల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి రాకేష్ నివాసానికి చేరుకొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓ దార్చారు కుటుంబానికి మనోధైర్యం చెప్పారు సందర్భంగా మాట్లాడుతూ నూతన గంటి రాకేష్ కు టుంబానికి బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుంది అని అన్నారు ఈకార్యక్రమంలో బిఅర్ ఎస్ పార్టీ మంచాల మండల పార్టీ అధ్యక్షులు చీరాల రమేష్ నూతన గంటి శేఖర్ మాజీ మండల అధ్యక్షులు చిందం రఘుపతి గ్రామసర్పంచ్ మానుపాటి శోభాకుమార్ గ్రామశాఖ అధ్యక్షులు పు న్నం రాము మొర్రి ఐలయ్య కాటి కృష్ణ లాలగారి జంగయ్య సిద్ధగోని రమేష్ గౌడ్ పొలమోని శ్రీకాంత్ ముదిరాజ్ మాధగోని సతీష్ యాదవ్ పి శివ బాహుబలి కందాల భాష రావుల మహేష్ రావుల రజిని నీళ్ల శివ తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థుల భద్రత, సంక్షేమం కోసం 'సురక్ష కవచ్' హ్యాండ్‌బుక్ ఆవిష్కరణ

- **యువత భవిష్యత్తు కోసం చర్చ, మానసిక ఆరోగ్యం కీలకం : సైబరాబాద్ సీపీ డా. యం. రమేష్**

సైబరాబాద్ వెలుతురు మే 15:





సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (SCSC) విద్యార్థుల భద్రత, సంక్షేమం కోసం మాదకద్రవ్యాల నియంత్రణ పై అవగాహన, బాధ్యతను పెంపొందించే లక్ష్యంతో "సురక్ష కవచ్ - కాలేజ్ సేఫ్టీ & వెల్‌బీయింగ్ హ్యాండ్‌బుక్" ను ప్రారంభించారు. విద్యార్థుల నేతృత్వంలోని క్లబ్‌ల ద్వారా వారిని సాధికారులను చేయడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం.

ఈ ప్రారంభోత్సవ వేడుకలో పోలీస్ ఉన్నతాధికారులు, విద్యా రంగ నిపుణులు, మానసిక ఆరోగ్య నిపుణులు, పౌర సమాజ ప్రతినిధులు మరియు విద్యార్థులు పాల్గొని, విద్యా సంస్థల్లో సురక్షితమైన వాతావరణం కోసం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. యం. రమేష్ మాట్లాడుతూ.. యువతలో పెరుగుతున్న ఒత్తిడి, ఒంటరితనం, వ్యసనాలను ఎదుర్కోవడానికి బహిరంగ చర్చలు జరగాలని, భావోద్వేగ నియంత్రణ, క్రమశిక్షణతో కూడిన జీవనశైలి ఎంతో ముఖ్యమని నొక్కి చెప్పారు. డ్రగ్ నెట్‌వర్క్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటిస్తూనే, విద్యార్థులు ఏవైనా సమస్యలు ఉంటే తమ కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు లేదా మెంటర్లతో స్వేచ్ఛగా పంచుకోవాలని సూచించారు. చర్చా సమయంలో బయోకెమిస్ట్రీ ఫ్యాకల్టీ వరలక్ష్మి మాట్లాడుతూ, కేవలం అవగాహన కార్యక్రమాలు మాత్రమే కాకుండా చర్చా వేదికలు (Discussion Forums) కూడా ముఖ్యమని సూచించారు. నల్సార్ యూనివర్సిటీ విద్యార్థి శ్రీవర్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా.. డ్రగ్స్ వ్యక్తులను, కుటుంబాలను, సమాజాన్ని నాశనం చేస్తాయని, వీటి నివారణలో పోలీసులకు సమాజం మరియు విద్యార్థుల మద్దతు అత్యవసరమని సీపీ స్పష్టం చేశారు.

నటుడు, దర్శకుడు, రచయిత రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ.. పెరుగుతున్న వ్యసనాలు, తోటివారి ఒత్తిడి మరియు అనారోగ్యకరమైన అలవాట్ల వల్ల కలిగే ప్రమాదాల గురించి విద్యార్థులను హెచ్చరించారు. విద్యార్థులు తమ జీవితంలో సానుకూల లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, 'సురక్ష కవచ్' వంటి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని సురక్షితమైన క్యాంపస్‌లను రూపొందించాలని కోరారు.

అనంతరం, తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలక్రిష్టా రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల సంక్షేమంలో విద్యా సంస్థల పాత్రను గుర్తుచేశారు. క్యాంపస్‌లలో యాంటీ రాగింగ్ చర్యలు, భద్రతా యంత్రాంగాల ప్రాముఖ్యతను ఆయన వివరించారు.

ఎస్‌సీఎస్‌సీ ప్రతినిధులు శ్రీమతి వనితా దాట్ల, శ్రీమతి చేతనా కాసం, మరియు శ్రీమతి శ్రీవిద్య రెడ్డి మాట్లాడుతూ..సమాజం మరియు పోలీసుల సహకారంతో యువత రక్షణ కోసం ఎస్‌సీఎస్‌సీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీమతి వైశాలి సాగర్ నేతృత్వంలో విద్యార్థులు "ముందుకు రండి, గళమెత్తండి. మౌనంగా ఉండకండి" అని సూచించారు.

మహిళా మరియు శిశు భద్రతా విభాగం డీసీపీ కె. సృజన మాట్లాడుతూ.. విద్యా సంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీ మార్గదర్శకాలు, 'పోష్' మరియు 'పోక్సో' నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. భద్రతా క్లబ్‌లను బలోపేతం చేయాలని సూచించారు.

ఎస్‌సీఎస్‌సీ డైరెక్టర్ శ్రీమతి రష్మీ శ్రీవాస్తవ విద్యార్థులు మరియు అధ్యాపకులతో ముఖాముఖి నిర్వహించి, క్యాంపస్‌లలో సేఫ్టీ మరియు వెల్‌నెస్ క్లబ్‌ల ఏర్పాటుపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమ ముగింపులో 'పాఠశాల' అనే యువ బృందం తెలుగు పాటలతో అందరినీ ఉత్సాహపరిచింది.

ఈ కార్యక్రమంలో డా. ఎం. రమేష్ (సీపీ, సైబరాబాద్), కె. సృజన (డీసీపీ), రాహుల్ రవీంద్రన్ (నటుడుదర్శకుడు), బాలక్రిష్టా రెడ్డి (చైర్మన్, ఉన్నత విద్యా మండలి), వనితా దాట్ల (ఎలికో హెల్త్‌కేర్), చేతనా కాసం (లీగల్ కార్నర్ ఎల్‌ఎల్‌పి), శ్రీవిద్య రెడ్డి (జి. పుల్లారెడ్డి విద్యా సంస్థలు), వైశాలి సాగర్ (మైక్రాన్ టెక్నాలజీ) మరియు రష్మీ శ్రీవాస్తవ (డైరెక్టర్, SCSC) తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ లు చేసిన పాత పనుల పెండింగ్ బిల్లులు వారికే ఇవ్వాలి

- **నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లు పాత సర్పంచులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదు**
- **సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని ఇబ్బందులకు గురి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి**
- **బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ డిమాండ్**

హైదరాబాద్ వెలుతురు మే 15:



రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు గతంలో పనిచేసిన పెండింగ్ బిల్లుల విషయంలో పాత సర్పంచ్లను ఇబ్బందులు పెడుతున్నారని ఇది సరికాదని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో పాత పాలకవర్గాలు గతంలో చేసిన పనులకు బిల్లులు ఇచ్చేందుకు కొత్త పాలకవర్గం వారు పాత బకాయిల బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని గతంలో సర్పంచులు పంచాయతీల్లో సొంత డబ్బులు పెట్టి అప్పులు చేసి మరీ పనులు చేయించగా నిధులు రాకపోవడంతో ఇన్ని సంవత్సరాలు ఇబ్బందులు పడ్డారని ఇప్పుడు బిల్లులు పడ్డప్పుడు కూడా ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు ఇంకా కొన్ని గ్రామపంచాయతీలో సర్పంచులు కమిషన్లు అడుగుతున్నారని ఇదెక్కడి అన్యాయం అన్నారు సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని పాత పాలకవర్గాలు చేసిన పనులకు సంబంధించిన బిల్లులను ఆమోదం తెలిపేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

## పెట్రోల్,డీజిల్ ధరలు పెంచడం వల్ల సామాన్యులపై తీవ్ర భారం



- **బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్**

హైదరాబాద్ వెలుతురు మే 15:

దేశవ్యాప్తంగా పెట్రోల్ మరియు డీజిల్ పై మూడు రూపాయలపైన పెంచడం పట్ల బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు అయిపోగానే కేంద్ర ప్రభుత్వం ఈ విధంగా సామాన్యుడు నడ్డి విరిచిందన్నారు.పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగి సామాన్యులు, రైతులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రవాణా ఛార్జీలు పెరగడంతో అన్ని రంగాలపై ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించి పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించాలని, ప్రజలపై భారాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలని లింగం గౌడ్ డిమాండ్ చేశారు

## మాదిగ మహాశక్తి మహాసభను జయప్రదం చేయాలి

సూర్యాపేట, వెలుతురు మే 15:



ఈనెల 22న జిల్లా కేంద్రంలోని జే గార్డెన్ లో నిర్వహించే మాదిగ మహాశక్తి మహాసభకు జిల్లాలోని మాదిగలు భారీ సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని మాదిగ మహాసభ జిల్లా నాయకులు బండారు సుధాకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగల ఓట్లు మాదిగలకే వేయాలని నినాదంతో మన ముందుకు వస్తున్న మాజీ మంత్రివర్యులు, మాదిగ మహాశక్తి వ్యవస్థాపకులు మోత్కుపల్లి నర్సింహులు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించినట్లు తెలిపారు. ఇప్పటికైనా మాదిగలు మేలుకొని మన ఓటు మనకు వేసుకుంటే మనం చట్టసభలో ప్రాతినిధ్య వహించే అవకాశం లభిస్తుందన్నారు. జిల్లా నలుమూలల నుండి మాదిగ సోదరులు పార్టీలు, ప్రజా సంఘాలకు అతీతంగా భారీ సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

## ప్రజారోగ్య పరిరక్షణ మరియు కెమిస్ట్స్ భవిష్యత్తు కోసం మే 20న దేశవ్యాప్తంగా ఒకరోజు బంద్ పిలుపు

హైదరాబాద్ వెలుతురు మే 15:

**TTCDA & AIOCD**




దేశవ్యాప్తంగా 12.40 లక్షలకుపైగా ఔషధ వ్యాపారులు, డ్రగ్ డిస్ట్రిబ్యూటర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ (AIOCD) కు అనుబంధ సంస్థ అయిన తెలంగాణ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ (TTCDA) ప్రభుత్వ వైఖరికి నిరసనగా మే 20, 2026 బుధవారం ఒక రోజు దేశవ్యాప్తంగా బంద్ నిర్వహించనున్నట్లు ప్రకటించింది.

గౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారికి సమర్పించిన వినతిపత్రంలో, ఫార్మసీ రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న కీలక సమస్యలపై పునరావృతంగా విజ్ఞప్తులు చేసినప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి స్పష్టమైన చర్యలు తీసుకోలేదని సంస్థ పేర్కొంది. దీంతో దేశవ్యాప్తంగా కెమిస్టుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నట్లు తెలిపింది.

**ప్రధాన ఆందోళన అంశాలు:**

- అక్రమ ఈఫార్మసీలు మరియు ప్రజారోగ్యానికి ముప్పు (G.S.R. 817(E))

ఈఫార్మసీ ప్లాట్‌ఫారమ్‌లు నియంత్రణ సడలింపులను దుర్వినియోగం చేస్తున్నాయని సంస్థ ఆరోపించింది. భౌతిక ధృవీకరణ లేకుండా మందుల విక్రయం జరగడం వల్ల ఒకే ప్రిస్క్రిప్షన్‌ను పలు మార్లు ఉపయోగించే అవకాశం పెరుగుతోందని తెలిపింది.

AI ఆధారిత నకిలీ ప్రిస్క్రిప్షన్‌ల ద్వారా యాంటీ బయోటిక్స్ మరియు అలవాటు చేసే మందులు నియంత్రణ లేకుండా అందుబాటులోకి రావడం వల్ల యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (AMR) వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఇది ప్రజారోగ్యంతో రాజీ పడటమేనని పేర్కొంది.

- ప్రిడేటరీ ప్రైసింగ్

పెద్ద కార్పొరేట్ సంస్థలు భారీ డిస్కౌంట్ల ద్వారా మార్కెట్ సమతుల్యతను దెబ్బతీస్తున్నాయని TTCDA & AIOCD పేర్కొన్నాయి. అవసరమైన ఔషధాలపై ప్రభుత్వమే (NPPA/DPCO ద్వారా) లాభ మార్జిన్లు నిర్ణయించినప్పటికీ, భారీ తగ్గింపులు ఇచ్చి చిన్న కెమిస్టులకు అన్యాయం జరుగుతోందని తెలిపింది.

దీంతో గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ఉన్న చిన్న మెడికల్ షాపుల మనుగడ ప్రమాదంలో పడుతుందని, చివరికి ప్రజలకు అందుబాటులో ఉండే ఔషధ సరఫరా వ్యవస్థనే దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది.

- అత్యవసర నోటిఫికేషన్ల ఉపసంహరణలో ఆలస్యం (G.S.R. 220(E))

కోవిడ్19 సమయంలో 2020 మార్చి 26న జారీ చేసిన తాత్కాలిక నోటిఫికేషన్‌ను ఇప్పటికీ కొనసాగించడం సమంజసం కాదని సంస్థ పేర్కొంది. ఈ నిబంధన వల్ల డ్రగ్ రూల్ 65లోని కఠిన నిబంధనలు బలహీనపడుతున్నాయని, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు ఈ అవకాశాన్ని వినియోగించుకుని నియంత్రణ నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని ఆరోపించింది.

**TTCDA & AIOCD ప్రధాన డిమాండ్లు:**

1. కోవిడ్ కాలంలో జారీ చేసిన తాత్కాలిక నోటిఫికేషన్ G.S.R. 220(E) ను వెంటనే ఉపసంహరించాలి.
2. ఈఫార్మసీలకు సంబంధించిన G.S.R. 817(E) నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి.
3. కార్పొరేట్ సంస్థల anaitikat డిస్కౌంట్లను అరికట్టేందుకు "లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్" విధానాన్ని అమలు చేయాలి.

**సంస్థల విజ్ఞప్తి:**

TTCDA అధ్యక్షుడు కె. శ్రీనివాస్ మరియు ప్రధాన కార్యదర్శి టి. రాజు సంయుక్తంగా మాట్లాడుతూ:

"ఇది కేవలం వ్యాపార సమస్య మాత్రమే కాదు, రోగుల భద్రతకు సంబంధించిన విషయం కూడా. ప్రభుత్వం మే 20 నాటికి ఈ డిమాండ్లపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే, ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా మేము నిరవధిక ఆందోళనకు దిగాల్సి వస్తుంది" అని వారు పత్రికా ప్రకటనలో తెలిపారు.

## 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలకు పారువెల్లి అంక విజయ దుర్గ భవాని కి ఆహ్వానం



హైదరాబాద్ వెలుతురు మే 15:

ప్రపంచ తెలుగు సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలకు ప్రముఖ సామాజిక సేవకురాలు, సీనియర్ ఫైనాన్షియల్ కన్సల్టెంట్, హ్యూమన్ రైట్స్ కార్యకర్త, మీడియా ప్రతినిధి మరియు సాహిత్యాభిమానిని శ్రీమతి పారువెల్లి అంక విజయ దుర్గ భవాని కి ప్రత్యేక ఆహ్వానం అందింది.

రాజమహేంద్రవరం నగరంలో జూన్ 6 మరియు 7 తేదీలలో జరగనున్న ఈ మహాసభల్లో తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి పరిరక్షణతో పాటు కవితా వేదికలు, సాహిత్య చర్చలు, రచయితల సన్మానాలు నిర్వహించనున్నారు.

సాహిత్య విభాగంలో దుర్గ భవాని రచించిన కవితలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. మహిళా చైతన్యం, తెలుగు తల్లి గొప్పతనం, మానవతా విలువలు, సమాజ సేవ వంటి అంశాలపై ఆమె రచించిన కవితలు సభలో వినిపించనున్నారు.

**దుర్గ భవాని కవితా పంక్తులు**

"తెలుగు తల్లి తలపుల్లో
తేనెలూరే మాటల వెలుగు
సాహిత్యమే మా శ్వాసగా
సంస్కృతికి నిలువెత్తు వెలుగు..."
"మానవత్వమే మా మతమైతే
సేవే మా జీవన గీతం
అక్షరమే ఆయుధమై
సమాజానికి వెలుగునిస్తాం..."

ఈ సందర్భంగా మహాసభల నిర్వాహకులు దుర్గ భవాని కి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. సమాజ సేవ, మహిళా సాధికారత, మీడియా మరియు సాహిత్య రంగాలలో ఆమె చేస్తున్న సేవలను ప్రశంసించారు.

ఆమె మాట్లాడుతూ తెలుగు భాష ప్రపంచ వ్యాప్తంగా మరింత విస్తరించాలని, యువత తెలుగు సంస్కృతిని కాపాడాలని ఆకాంక్షించారు. ఇటువంటి మహాసభలు భాషాభిమానులకు ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు.

## ఖైరతాబాద్‌లో లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



- **సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే దానం నాగేందర్**
- **షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాల చెక్కుల పంపిణీ**
- **హిమాయత్‌నగర్ డివిజన్‌కు చెందిన ఇద్దరికి ఆర్థిక సహాయం**
- **మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ చేతుల మీదుగా అందజేత**
- **ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని నాయకుల వ్యాఖ్యలు**
- **కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్న కార్యక్రమం**

వెలుతురు, హైదరాబాద్ మే 15:

ఖైరతాబాద్ నియోజకవర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ప్రయోజనాలను అర్హులకు చేరవేస్తున్నట్లు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. శుక్రవారం నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులతో పాటు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

హిమాయత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ చేతుల మీదుగా హిమాయత్‌నగర్ డివిజన్‌కు చెందిన ఇద్దరు లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అత్యవసర వైద్య చికిత్సలకు ఆర్థిక సహాయం అందుతుండగా, షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాల ద్వారా అర్హులైన కుటుంబాలకు ఊరట లభిస్తోందన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుంది.



**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 15:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేటలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలను ఐదవ రోజు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన, పుస్తకాల వితరణ, పుస్తక సమీక్ష మరియు ఉత్తమ పాఠకులకు బహుమతి ప్రదానం వంటి కార్యక్రమాల్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు గ్రంథాలయంలోని పుస్తకాలను కూడా అధ్యయనం చేసినప్పుడే విస్తృతమైన విషయపరిజ్ఞానం పెంపొందించుకుంటారని, తలదించుకొని చదివినప్పుడే తల ఎత్తుకొని జీవించేలా పుస్తకాలు విద్యార్థులను తయారు చేస్తాయని అన్నారు. కార్యక్రమ ఇన్చార్జి డాక్టర్ రాచమళ్ళ శ్రీను మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలతో పాటు ఉన్నత విద్యను అభ్యసించడానికి కావలసిన పుస్తకాలు గ్రంథాలయంలో ఉన్నాయని వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య తండు సాయన్నదాసు రాసిన సాయన తత్వాలు పుస్తకాన్ని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి. వెంకటేశ్వరరావు, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జె . చిన్నబాబు, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీ నీలిమ, పరిపాలనాధికారి జి. కరుణాకర్, అధ్యాపకులు డాక్టర్ రత్నమంజుల, డాక్టర్ జి. సునీత, డాక్టర్ సిహెచ్.వెంకట్ గౌడ్, ఎం. అనిత, డాక్టర్ డి. కిషన్, డాక్టర్ ఎం. రవీందర్ రావు, టి. శ్రీనివాస్, జె. నరేశ్, రవి, ఆంజనేయులుతో పాటు కార్యాలయ సిబ్బంది ఫయాజ్, షరీఫ్, శ్రీదేవి, నాగరాజు, బసవయ్య రాంబాబు, నవీన్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ధరావత్ ప్రవల్లికను అభినందించిన డా.సునీత ప్రసాద్

- **ఉన్నత చదువులకు మోదీన్ పూర్ సర్పంచ్ డా.సునీత ప్రసాద్ రూ.10 వేల సాయం**
- **పదోలో 561 మార్కులతో స్కూల్ టాపర్ గా నిలిచిన ప్రవల్లిక**





**సూర్యాపేట, వెలుతురు ఏప్రిల్ 15 :** సూర్యాపేట జిల్లా, చివ్వెంల మండలం, మోధిన్ పురం పురం గ్రామ పంచాయతీ పరిధిలోని జగ్గు తండా గ్రామానికి చెందిన ప్రతిభావంతురాలు ధరావత్ ప్రవల్లిక టీజీ 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అద్భుత ఫలితాన్ని సాధించిన సందర్భంగా ఆమె ఉన్నత చదువుల కోసం శుక్రవారం మోదీన్ పూర్ సర్పంచ్ డా.సునీత ప్రసాద్ రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ చిన్న గ్రామం నుంచి వచ్చిన ప్రవల్లిక మొత్తం 561 మార్కులు సాధించి ఉత్తీర్ణత పొందడమే కాకుండా తన పాఠశాలలో టాపర్గా నిలవడం విశేషం. ప్రవల్లిక తండ్రి ధరావత్ నాగు, తల్లి లక్ష్మి రోజువారీ కూలీలుగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన వారయినప్పటికీ, తమ కూతురు చదువులో ముందుకు రావాలని ఎంతో కష్టపడి ప్రోత్సహించారు. ఆర్థిక ఇబ్బందులు ఇబ్బందులు ఉన్నప్పటికీ చదువు విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ప్రవల్లికను చదివించడం వారి గొప్ప త్యాగానికి నిదర్శనం. ప్రవల్లిక చిన్నప్పటి నుంచే చదువుపై ఆసక్తి చూపుతూ క్రమశిక్షణతో చదువుకుంది. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఆమె విజయానికి ప్రధాన కారణాలు, గణితం, సైన్స్ వంటి విషయాలలో మంచి ప్రతిభ కనబరిచి ఉన్నత మార్కులు సాధించింది. అన్ని విషయాలలోనూ సమానంగా శ్రద్ధ పెట్టడం ద్వారా మంచి గ్రేడులు పొందింది. పేదరికం మధ్య పెరిగినప్పటికీ, తన లక్ష్యాన్ని వదలకుండా కష్టపడి చదివి ఈ స్థాయికి చేరుకోవడం ద్వారా ప్రవల్లిక ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలిచింది. ఆమె విజయం గ్రామంలో ఆనందాన్ని నింపింది. గ్రామస్థులు, ఉపాధ్యాయులు, స్నేహితులు అందరూ ప్రవల్లికను అభినందిస్తూ ఆమె భవిష్యత్తు మరింత ప్రకాశవంతంగా ఉండాలని ఆకాంక్షించారు. తమ కూతురు ఇంత మంచి ఫలితం సాధించడం తమ జీవితంలో గొప్ప ఆనందం అని తల్లిదండ్రులు భావోద్వేగంతో తెలిపారు. తను కష్టానికి ఫలితం దక్కిందని వారు ఆనందం వ్యక్తం చేశారు. పేదరికం ఉన్నప్పటికీ, పట్టుదలతో ముందుకు సాగితే విజయాన్ని సాధించవచ్చని ఈ సంఘటన మరోసారి నిరూపించింది. భవిష్యత్తులో ఉన్నత చదువులు అభ్యసించి మంచి స్థాయికి చేరుకోవాలని వాలని ప్రవల్లిక సంకల్పించింది. తన సన కుటుంబాన్ని గర్వపడేలా చేయాలని, ఉపయోగపడే వ్యక్తిగా ఎదగాలని ఆమె లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ, అవసరమైన సహాయం అందించాలని ముందుకు వచ్చారు. మొత్తంగా ధరావత్ ప్రవల్లిక సాధించిన ఈ విజయం కేవలం ఒక విద్యార్థి విజయం మాత్రమే కాదు, కష్టం, పట్టుదల, తల్లిదండ్రుల త్యాగం కలిసినప్పుడు ఎలాంటి అడ్డంకులు ఉన్నా విజయాన్ని సాధించవచ్చని చూపిన ప్రేరణాత్మక గాథగా నిలిచింది. ఈ కార్యక్రమం లోడా "శ్రీనునాయక్ ,గ్రామ కార్యదర్శి తిరుపతి నాయక్, ముకుంద నాయక్ ,పోలీస్ జాటోత్ రావినాయక్, చీమ వీరయ్య ,కోడిదల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా బహిరంగ సభను జయప్రదం చేయండి

- **ఉపాధి హక్కుల కోసం ఉద్యమిధం రండి.**



**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 15:** మండలంలోని కక్కిరేణి గ్రామంలో ఈరోజు ఉపాధి హామీ కూలీల తో పనిచేస్తున్న ప్రదేశానికి వెళ్లి జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కందుల హనుమంతు , మేడి ముకుంద పాల్గొని వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం సుదీర్ఘకాలంగా ఎన్నో పోరాటాలు నడపడం వల్ల వామపక్షాల మద్దతుతో వందరోజుల పని గ్యారెంటీ చేస్తూ చట్టం చేయబడిందని దీనికి ప్రధానమైన కారణం వ్యవసాయ కార్మిక సంఘం మేనని ,కుటుంబ ఆర్థిక వ్యవస్థను పెంచడానికి పేదరిక నిర్మూలన కోసం కృషి చేయడానికి ఆర్థిక భరోసాను కల్పించిన ఈ చట్టాన్ని నేడు తూట్లు పొడుస్తూ వచ్చిన నిధులను పక్కదారి మళ్లిస్తూ అనేక కొర్రీలు పెడుతూ రాను రాను ఈ చట్టాన్ని లేకుండా చేసే ప్రయత్నం కొనసాగుతుందని ఫోటో క్యాప్షన్ రద్దు చేయాలని కొంతమంది మూడు నాలుగు కిలోమీటర్లు నడిచి వచ్చి ఫోటో కన్ను పడకపోవడంతో రిటర్న్ మళ్లీ నడిచి వెళ్ళిపోతున్నారని పనిచేసే వారికి కచ్చితంగా కన్నుతో లింకు పెట్టకుండా ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 18న రామన్నపేట మండల కేంద్రంలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మూడో మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభకి ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా కార్యదర్శి బి.వెంకట్ రాష్ట్ర కార్యదర్శి ఆర్. వెంకట్ రాములు హాజరవుతున్నారని దీనికి వ్యవసాయ కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయగలరని కోరారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ కమిటీ ని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వేముల సైదులు, కన్నెబోయిన యాదయ్య ,నీల సంతోష , మమత ,నాగమణి , పార్వతమ్మ ,అండాలు , రాధా, కల్పన, లక్ష్మి , కవిత ,మంజుల తదితరులు పాల్గొన్నారు.

# రానున్న రోజుల్లో గుండాలలో కాంగ్రెస్‌కు గడ్డుకాలమే..!

- **పార్టీ క్యాడర్‌లో అసంతృప్తి జ్వాలలు – నాయకత్వంపై పెరుగుతున్న విమర్శలు**
- **పదవుల పంపకాలపై ఆగ్రహం**
- **– కష్టపడ్డ కార్యకర్తలకు గుర్తింపు లేదనే వాదనలు**



**గుండాల, మే 15 (వెలుతురు న్యూస్ ):**

గుండాల మండలంలో కాంగ్రెస్ పార్టీ అంతర్గత పరిస్థితులు రోజు రోజుకు క్లిష్టంగా మారుతున్నాయని రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ సాగుతోంది. ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలను పక్కనపెట్టి, ఇటీవల పార్టీలో చేరిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు మండల కాంగ్రెస్ శ్రేణుల్లో అసంతృప్తికి దారితీస్తున్నాయి. గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేసిన పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు తగిన గుర్తింపు లేక నిరాశలో ఉన్నారని సమాచారం. మండల స్థాయిలో తీసుకుంటున్న కీలక నిర్ణయాలు కింది స్థాయి నాయకత్వానికి తెలియకుండా జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో పార్టీ కార్యక్రమాల పట్ల కార్యకర్తల్లో ఆసక్తి తగ్గుతోందని స్థానిక రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఇటీవల జరిగిన నామినేషన్లు, పదవుల కేటాయింపుల విషయంలో కూడా స్థానిక నాయకులకు అన్యాయం జరిగిందనే చర్చ రాజకీయ వర్గాల్లో కొనసాగుతోంది. కొంతమంది కార్యకర్తలు బహిరంగంగానే తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తుండడం గమనార్హం. "పార్టీ కోసం కష్టపడిన వారికి కాకుండా కొత్తగా వచ్చిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారు" అనే వాదనలు మండల వ్యాప్తంగా వినిపిస్తున్నాయి. మరోవైపు, స్థానిక ఎమ్మెల్యే జిల్లా అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ మండల కేంద్రంలోని కార్యకర్తలను పట్టించుకోవడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో గ్రామ స్థాయి క్యాడర్‌లో మరింత నిరుత్సాహం నెలకొన్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితులు కొనసాగితే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుండాల మండలంలో గడ్డు కాలం తప్పదనే అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయంలో ప్రత్యర్థి పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత విభేదాలను తమకు అనుకూలంగా మలుచుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. పార్టీకి కష్టపడ్డ కార్యకర్తలకు సముచిత గుర్తింపు ఇచ్చి, అంతర్గత విభేదాలను సకాలంలో పరిష్కరిస్తేనే కాంగ్రెస్ పార్టీ తిరిగి బలోపేతం అయ్యే అవకాశముందని రాజకీయ పరిశీలకులు సూచిస్తున్నారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు నాయకత్వం సమన్వయంతో ముందుకు సాగి కార్యకర్తల్లో నమ్మకం పెంచాల్సిన అవసరం ఉందని సీనియర్ నాయకులు అభిప్రాయపడుతున్నారు. "క్యాడర్‌ను కాపాడితేనే పార్టీ భవిష్యత్ బలోపేతం" ప్రస్తుతం గుండాల కాంగ్రెస్‌లో నెలకొన్న పరిస్థితులు భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కష్టపడ్డ కార్యకర్తలకు తగిన గౌరవం, పదవుల్లో ప్రాధాన్యత కల్పించకపోతే పార్టీకి మరింత నష్టం జరిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

# ఇంద్రపాలనగరం గ్రామంలో ఉచిత కరాటే శిక్షణ క్లాసులు



**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 15:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ లో ఈరోజు సమ్మర్ క్యాంప్ ఉచిత కరాటే శిక్షణ క్లాస్ లు ప్రారంభించడం జరిగింది .గ్రామంలోని, యువతీ, యువకులు, బాలురు, బాలికలు ఈసదవకాశాన్ని వినియోగించుకొని ఉచిత కరాటే శిక్షణ పొందాలని సర్పంచ్ గర్దాస్ విక్రమ్ సూచించారు. ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, ఈర్లపల్లి మల్లయ్య, మర్రి మహేష్, గర్దాస్ శ్రీకాంత్, గర్దాస్ సాయి, ఈర్లపల్లి కృష్ణ, ఈర్లపల్లి రమేష్, విద్యార్థులు, కరాటే మాస్టర్ అప్పం చెన్నకేశ్వర్, తెల్లం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసిన రామన్నపేట సీఐ, ఎస్సై



***రామన్నపేట వెలుతురు న్యూస్ మే 15:***

మండలం తుమ్మలగూడెం గ్రామంలోని విద్యా రైస్ మిల్లు నీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియ, ధాన్యం తూకాలు, రైతులకు అందుతున్న సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు మరియు ఎస్ఐ నాగరాజు, ధాన్యం కొనుగోలు లో ఎలాంటి ఆలస్యం జరగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. "రైతు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కాలి. తేమ, తాలు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దు" అని స్పష్టం చేశారు.

# తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా మెరుగు మధు నియామకం..



భువనగిరి మే, 15 (వెలుతురు న్యూస్):

తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా భువనగిరి పట్టణానికి చెందిన మెరుగు మధు ని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు పూస శ్రీనివాస్ నియామక పత్రాన్ని అందజేశారు.

రాష్ట్రవ్యాప్తంగా అవి వివిధ ఉద్యమకారుల సంఘాలను సమైక్యపరచడానికి, ఏకతాటిపై తీసుకొని వచ్చి మలిదశ తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సి ఉందని పూస శీను అన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి రాష్ట్రవ్యాప్తంగా

# యుద్ధ పరిస్థితుల పేరుతో ఇంధన ధరల భారం మోపొద్దు

- **పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలి...**
- **మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ వై నరోత్తమ్....**

**జహీరాబాద్ వెలుతురు, మే 15 :** ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు, అంతర్జాతీయ ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయని ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ, అదే కారణంగా దేశ ప్రజలపై పెట్రోల్, డీజిల్ ధరల భారాన్ని మోపడం అన్యాయమని మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ వై నరోత్తమ్ విమర్శించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని తన కార్యాలయం నుండి శుక్రవారం మధ్యాహ్నం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో ఇప్పటికే నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, రైతాంగ సంక్షోభంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం వల్ల రవాణా ఛార్జీలు, కూరగాయలు, నిత్యావసర వస్తువులు, నిర్మాణ సామగ్రి ధరలు భారీగా పెరిగి ప్రజల జీవన వ్యయం మరింత పెరుగుతోందన్నారు. ముఖ్యంగా రైతులు వ్యవసాయ పనులకు వినియోగించే డీజిల్ ధరల పెంపుతో సాగు ఖర్చులు అధికమై రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పెట్రోల్ ధరలు రూ.110 వరకు ఉండగా, అసలు ఇంధన ధర కంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులే అధికంగా ఉన్నాయని ఆయన



ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీ, రాష్ట్ర ప్రభుత్వం వ్యాట్ రూపంలో భారీ పన్నులు విధించడం వల్ల సామాన్య ప్రజలు మోయలేని భారం పడుతోందన్నారు. ప్రభుత్వాలకు నిజమైన చిత్తశుద్ధి ఉంటే పన్నులను తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలే గానీ, యుద్ధ పరిస్థితులను సాకుగా చూపిస్తూ మరింత భారం మోపడం సరి కాదన్నారు. దేశ భద్రత ప్రతి పౌరుడికి ముఖ్యమే అయినప్పటికీ, ఆర్థిక భారాన్ని పూర్తిగా ప్రజలపై మోపడం సరైంది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వాలకు చేసిన ప్రధాన డిమాండ్లు :

*** పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ తగ్గించాలి.**
*** రాష్ట్ర ప్రభుత్వం వ్యాట్ తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలి.**
*** పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలి.**
*** రైతులకు డీజిల్‌పై ప్రత్యేక సబ్సిడీ ఇవ్వాలి.**
*** ఆటో, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు ఆర్థిక సాయం ప్రకటించాలి.**
*** నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.**
*** యుద్ధ పరిస్థితుల పేరుతో ఇంధన ధరలను అనవసరంగా పెంచకూడదు.**

ప్రజల ఇబ్బందులను అర్థం చేసుకుని ప్రభుత్వాలు వెంటనే స్పందించి పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించి ప్రజలకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్, జి. మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీ సుదర్శన యాగానికి సర్వం సిద్ధం



- **బ్రహ్మశ్రీ గురురాజ్ శర్మ పురోహితులు**

**వెలుతురు నారాయణఖేడ్ మే 15 :** సంగారెడ్డి జిల్లా : నారాయణఖేడ్ పట్టణంలో అధిక మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 18వ తారీకు నుండి జూన్ 15వ తారీకు వరకు కొనసాగే శ్రీ లక్ష్మీ సుదర్శన యాగానికి సర్వం సిద్ధమయ్యాయని మహతి జ్యోతిష్యాలయంలో రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి ఆశీస్సులతో వైభవంగా నిర్వహించనున్నట్లు పురోహితుల బ్రహ్మశ్రీ గురురాజ్ శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పై కార్యక్రమంలో భక్తులు నెలరోజులపాటు ప్రతి రోజు నిర్వహించే హోమ కార్యక్రమంలో దంపతులు, సాయంత్రం ప్రత్యేకంగా మహిళలచే కుంకుమాభిషేకం,లలితా సహస్రనామం కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు మహా అన్న ప్రసాదం స్వీకరించాలని తెలిపారు.



లక్ష్మీ సుదర్శన యాగం విశిష్టత

బ్రహ్మశ్రీ మలమంచి గురురాజ్ శర్మ

సుదర్శన యాగం అనేది శ్రీ మహావిష్ణువు యొక్క దివ్యాయుధమైన సుదర్శన చక్రంకు చేసే పవిత్రమైన హోమం. ఈ యాగం ద్వారా భక్తులు ఆరోగ్యం, శాంతి, రక్షణ మరియు ఐశ్వర్యం పొందుతారని నమ్మకం,దుష్ట శక్తులు, నెగటివ్ ప్రభావాలు తొలగుతాయి. కుటుంబంలో శాంతి, సౌఖ్యం పెరుగుతుంది.ఆరోగ్య సమస్యలు తగ్గి ఆయురారోగ్యం కలుగుతుంది.వ్యాపారం, ఉద్యోగం, విద్యలో అభివృద్ధి కలుగుతుంది.గ్రహ దోషాలు, అపమృత్యు భయాలు తగ్గుతాయని విశ్వాసం ఇంటిలో ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడుతుంది. ఆధ్యాత్మిక ప్రాముఖ్యత: సుదర్శన చక్రం ధర్మాన్ని కాపాడే దైవశక్తికి ప్రతీక.ఈ యాగం ద్వారా మనస్సుకు ప్రశాంతత, భక్తి, ధైర్యం పెరిగి మనిషి తన జీవితాన్ని ఆనందమయం చేసుకోవచ్చని బ్రహ్మశ్రీ గురురాజ్ శర్మ తెలిపారు.

# హుగ్గెల్లీ అభివృద్ధికి అందరూ సహకరించాలి





- **మహిళా సంఘాలతో గ్రామాభివృద్ధికి మరింత బలం...**
- **ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్యం, తాగునీటి సదుపాయాలపై ప్రత్యేక దృష్టి...**
- **సర్పంచ్ విమల శ్రీనివాస్ రెడ్డి పిలుపు...**

జహీరాబాద్ వెలుతురు, మే 15: మండలంలోని హుగ్గెల్లీ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రామ అభివృద్ధి, గ్రామ సమైఖ్య గ్రూపుల సమీక్షా సమావేశం సర్పంచ్ విమల శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఆమె పిలుపునిచ్చారు. సమావేశంలో సర్పంచ్ విమల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో మహిళా సంఘాల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారత కోసం గ్రామ సమైఖ్య గ్రూపులు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు మహిళలు ముందుండి సహకరించాలని కోరారు.

గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. పాఠశాలల పరిసరాల్లో ఎలాంటి పారిశుధ్య సమస్యలు లేకుండా చర్యలు చేపడతామని, విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యపై గ్రామ పంచాయతీ ప్రత్యేక దృష్టి సారిస్తుందని చెప్పారు. గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు. గ్రామ సమస్యల పరిష్కారంలో ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# శని అమావాస్యకు సర్వం సిద్ధం..!





- **సర్వాంగ సుందరంగా ముస్తాబైన దత్తక్షేత్రం...**
- **భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి**
- **ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ అల్లాడి వీరేశం వెల్లడి...**

**జహీరాబాద్ వెలుతురు మే 15:** సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దిపూర్ గ్రామంలోని శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ ఆవరణలో ఉన్న శ్రీ శనీశ్వర స్వామి దేవాలయం శని అమావాస్య, శని జయంతి వేడుకలకు సర్వం సిద్ధమైంది. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని ఆలయ పరిసరాల్లో విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు ఆశ్రమ పీఠాధిపతులు అవధూత గిరి, సిద్ధేశ్వరానందగిరి, ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ అల్లాడి వీరేశం వెల్లడించారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని తాగునీటి సదుపాయాలు, విశ్రాంతి కోసం నీడ ఏర్పాట్లు, క్యూలైన్ నిర్వహణ వంటి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అలాగే ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణం కలిగేలా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. శని అమావాస్య సందర్భంగా శనేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, నవగ్రహారాధన, హారతులు నిర్వహించనున్నట్లు వివరించారు. శని అమావాస్య అనేది శనివారం రోజున అమావాస్య తిథి కలిసివచ్చే పవిత్ర దినంగా భావిస్తారని, ఈ రోజున శనేశ్వర స్వామిని భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తే శని దోషాలు తొలగి ఆయురారోగ్యాలు, శుభ ఫలితాలు కలుగుతాయని భక్తుల విశ్వాసమని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపాశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన



**మోత్కూర్, మే 15,(వెలుతురు న్యూస్ ):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈరోజు మోత్కూరు శాఖ గ్రంథాలయంలో లైబ్రరీ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. విద్యా వారోత్సవంలో భాగంగా నిర్వహించిన పుస్తక ప్రదర్శనలో విద్యార్థులు, పాఠకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుస్తక పఠనం వల్ల కలిగే లాభాలను పలువురు వక్తలు విద్యార్థులకు తెలియజెప్పారు. శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న గ్రంథాలయంలో ఒకరోజు కార్యక్రమం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. గ్రంథాలయాలను వేసవి సెలవుల్లో విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్ని పోటీ పరీక్షలకు సంబంధించిన స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉన్నట్లు గ్రంథాలయ చైర్మన్ కోమటి మత్స్యగిరి తెలిపారు.నెలరోజుల లైబ్రరీ డే (గ్రంథాలయంలో ఒకరోజు) కార్యక్రమంలో ప్రతిరోజు హాజరై పుస్తక పఠనం చేసిన విద్యార్థులకు నగదు 2500/ తో ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఈ వేసవి సెలవుల్లో సెల్ ఫోన్లకు దూరంగా ఉంచుతూ పుస్తక పఠనానికి దగ్గర చేయాలని, తమ పిల్లల్ని గ్రంథాలయాల బాట పట్టించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవినేని అరవిందరాయుడు, ప్రజాభారతి పూర్వ ప్రధాన కార్యదర్శి తోకిటి మనోహరా చారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ పోచం బిక్షపతి, కార్యదర్శి జంగ నాగయ్య, కోశాధికారి కప్పే యాకేష్, డైరెక్టర్లు ఎండి రఫీ, రేణిగుంట్ల ప్రణతి, పోలోజు శేఖరా చారి, పాఠకులు బయ్యని రాజు, సజ్జనం మనోహర్, లైబ్రరీ ఇంచార్జి చిలకమర్రి బాబు చారి, ప్రభాకర్, సోమలింగం, గౌసు తదితరులు పాల్గొన్నారు.

## అపరిచితులను పనిలో నియమించుకునే ముందు తగు విచారణ అవసరం

- **ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు**

**మోత్కూర్, మే 15 (వెలుతురు న్యూస్):** ఇటీవల జరిగిన కొన్ని సంఘటనల దృష్ట్యా ఇంట్లో పనిమనుషులు, వాచ్‌మెన్‌లు, కేర్‌టేకర్‌లను నియమించుకునే సమయంలో ప్రజలు తప్పనిసరిగా అప్రమత్తంగా వ్యవహరించాలని మోత్కూర్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు గురువారం విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ శాఖ ప్రజల భద్రత దృష్ట్యా విడుదల



చేసిన అవగాహన సూచనలను ఆయన వివరించారు. పనిమనుషులను నియమించే ముందు వారి పూర్తి వివరాలు, ఆధార్, ఫోటో, శాశ్వత చిరునామా, మొబైల్ నంబర్లు సేకరించి ధృవీకరించుకోవాలని తెలిపారు. ఇతర రాష్ట్రాలు లేదా ప్రాంతాల నుంచి వచ్చిన వారిని నియమించే సందర్భంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమీప పోలీస్ స్టేషన్‌లో వెరిఫికేషన్ చేయించుకోవడం మంచిదన్నారు.ఇళ్లలోని నగదు, బంగారం, విలువైన వస్తువుల సమాచారం అపరిచితులతో పంచుకోవద్దని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, అనుమానాస్పద కదలికలు గమనించినా వెంటనే డయల్ 100 లేదా 112కు సమాచారం అందించాలని కోరారు.ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం, పొరుగువారితో పరస్పర సమాచారాన్ని కొనసాగించడం ద్వారా నేరాలను అరికట్టవచ్చని పేర్కొన్నారు. ప్రజల అప్రమత్తతే సమాజ భద్రతకు ప్రధాన ఆధారమని, పోలీస్ శాఖకు సహకరించాలని ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు.

# వడ్లను ఇంకెప్పుడు కొంటారు



- **బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య.**

**మోత్కూర్, మే 15 (వెలుతురు న్యూస్):** కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలని రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని అనాజిపుర గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయకపోవడం దారుణమని విమర్శించారు.రానున్న అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా మోత్కూర్ అధ్యక్షుడు భీమిడి తిరుమలరెడ్డి, రాష్ట్ర నాయకుడు దండ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా నాయకుడు ఏనుగు జితేందర్ రెడ్డి, గౌరు శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు గుంటి సతీష్, తీగల శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రక్షణ హబ్‌గా మారనున్న ఏపీ




- పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ
- కర్నూలులో 'డ్రోన్ సిటీ'కి శ్రీకారం
- పుట్టపర్తిలో అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్
- ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన రాజ్‌నాథ్ సింగ్, చంద్రబాబు
- పట్టపర్తి నుంచి ప్రపంచ దేశాలకు డ్రోన్ల సరఫరా

**అమరావతి వెలుతురు మే 15:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశ రక్షణ రంగ మ్యాప్‌లో ఒక సరికొత్త శక్తిగా ఎదుగుతోంది. సత్యసాయి జిల్లాలోని పుట్టపర్తిలో అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగిస్తూ, పట్టపర్తి నుంచి ప్రపంచంలోని ప్రతి మూలకు డ్రోన్లను సరఫరా చేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో ఆధ్యాత్మికతకు, సేవకు మారుపేరుగా ఉన్న పుట్టపర్తి, ఇకపై అత్యాధునిక రక్షణ పరికరాల తయారీకి కేంద్ర బిందువుగా మారబోతోందని ఆయన ప్రకటించారు. ఏపీ అంటే కేవలం ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాదని, అది 'అడ్వాన్స్‌డ్ ఆంధ్రప్రదేశ్' అని అభివర్ణించిన కేంద్రమంత్రి, ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రాంతీయ అభివృద్ధి మరింత వేగవంతం కాబోతోందని వెల్లడించారు. సమష్టి కృషి, విశ్వసోదర భావనతో దేశ నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించబోతోందని ఆయన కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసల జల్లు కురిపించారు. చంద్రబాబు వంటి దూరదృష్టి కలిగిన నాయకుడిని తాను ఎక్కడా చూడలేదని, ఆయనకున్న శాస్త్రీయ దృక్పథం వల్లే అంతర్జాతీయ సంస్థలు ఏపీ వైపు చూస్తున్నాయని చెప్పారు. చంద్రబాబు చేస్తున్న నిరంతర కృషి వల్లే గూగుల్ వంటి దిగ్గజ సంస్థ రాష్ట్రంలో రూ. లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిందని గుర్తుచేశారు. నాయకుడికి ఉండాల్సిన నిబద్ధత, అభివృద్ధి పట్ల ఉన్న ఆకాంక్ష చంద్రబాబులో పుష్కలంగా ఉన్నాయని, ఆయన నాయకత్వంలో ఏపీ పారిశ్రామికంగా సరికొత్త అధ్యాయాన్ని లిఖించబోతోందని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని యువతకు స్థానికంగానే అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి వస్తుందని, తద్వారా మేధో వలసలు తగ్గుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. దేశ రక్షణ రంగంలో వస్తున్న పెను మార్పుల గురించి రాజ్‌నాథ్ సింగ్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఒకప్పుడు భారత్ ప్రపంచంలోనే అతి పెద్ద ఆయుధ దిగుమతిదారుగా ఉండేదని, యుద్ధ సమయాల్లో విదేశాల వైపు చూడాల్సి వచ్చేదని గుర్తు చేశారు. కానీ గత పదేళ్లలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని, 2004లో రూ. 46 వేల కోట్లుగా ఉన్న దేశీయ ఆయుధ తయారీ ఇప్పుడు రూ. 1.75 లక్షల కోట్లకు చేరడం గర్వకారణమని అన్నారు. రక్షణ రంగంలో సంపూర్ణ స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగాలు చేయి చేయి కలిపి నడుస్తున్నాయని ఆయన వివరించారు. ఈ క్రమంలోనే కర్నూలును 'డ్రోన్ హబ్'గా మారుస్తున్నామని, ఎనిమిది ప్రముఖ డ్రోన్ కంపెనీలు కలిసి అక్కడ 'డ్రోన్ సిటీ'ని నిర్మించడానికి సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. వ్యవసాయం, ఆర్థిక వ్యవస్థ మరియు యుద్ధ తంత్రంలో డ్రోన్లు గేమ్ ఛేంజర్‌గా మారబోతున్నాయని ఆయన తెలిపారు. పుట్టపర్తి వేదికగా ఐదో తరం యుద్ధ విమానాలు గగనంలో ఎగరబోతున్నాయని కేంద్రమంత్రి సంచలన ప్రకటన చేశారు. కనురెప్పపాటులో శత్రువులను మట్టుబెట్టే శక్తివంతమైన విమానాలు ఇక్కడ ఉత్పత్తి కాబోతున్నాయని, ఇది దేశ రక్షణకు కొండంత అండగా నిలుస్తుందని చెప్పారు. రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ప్రతిష్టాత్మక సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ రూ. 480 కోట్ల పెట్టుబడితో ఇక్కడ తన కార్యకలాపాలను ప్రారంభించబోతోందని, దీనివల్ల విదేశీ దిగుమతులపై భారం తగ్గుతుందని వివరించారు. వీటితో పాటు హెచ్ఎఫ్‌సీఎల్ సంస్థ రూ. 1,294 కోట్ల పెట్టుబడులతో రాబోతోందని, ఆయుధ తయారీ రంగంలో భారత్ స్వయం సమృద్ధి సాధించాలనే సంకల్పానికి ఈ ప్రాజెక్టులు ఊతమిస్తాయని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమంతో రాయలసీమ ప్రాంతం పారిశ్రామికంగా మరియు రక్షణ పరంగా ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించబోతోంది.

# ఏపీ సీఎస్ సాయిప్రసాద్ పదవీ కాలం పొడిగింపు

- నవంబర్ వరకు ఆయనే సారథి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ
- ప్రస్తుత మే నెలాఖరుతో ముగియనున్న పదవీ కాలం; మరో ఆరు నెలల పాటు విధుల్లో కొనసాగింపు



**అమరావతి వెలుతురు మే 15:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగంలో కీలకమైన అధికార మార్పులు, పొడిగింపుల పర్వం కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె. సాయిప్రసాద్ పదవీ కాలాన్ని పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత మే నెలాఖరుతో ఆయన పదవీ విరమణ చేయాల్సి ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించిన కేంద్ర సిబ్బంది మరియు శిక్షణ శాఖ, ఆయన సర్వీసును మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం 2026 జూన్ 1వ తేదీ నుంచి నవంబర్ 30వ తేదీ వరకు సాయిప్రసాద్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతల్లో కొనసాగుతారు. రాష్ట్రంలో పరిపాలన సజావుగా సాగడానికి, అనుభవజ్ఞుడైన అధికారి అవసరమని భావించిన ప్రభుత్వం, ఆయన పదవీ కాలాన్ని పొడిగించాలని కేంద్రాన్ని కోరింది. ఆల్ ఇండియా సర్వీస్ రూల్స్ పరిధిలోని నిబంధనలను అనుసరించి కేంద్రం ఈ వెసులుబాటు కల్పించింది. కీలకమైన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు వేగవంతం అవుతున్న తరుణంలో సీఎస్ పొడిగింపు నిర్ణయం ప్రభుత్వానికి ఊరటనిచ్చే అంశంగా మారింది. 1991 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సాయిప్రసాద్, గత మార్చి 1వ తేదీన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి రాష్ట్ర సచివాలయంలో పరిపాలన వేగం పుంజుకుంది. సాయిప్రసాద్ బాధ్యతలు చేపట్టిన సమయంలో తిరుమల తిరుపతి దేవస్థానం, దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థాన వేద పండితులు ఆశీర్వచనాలు అందించి ప్రత్యేక పూజలు నిర్వహించిన సంగతి తెలిసిందే. అంతకుముందు సీఎస్‌గా పనిచేసిన విజయానంద్ 2026 ఫిబ్రవరి 28న పదవీ విరమణ చేయడంతో, సీనియారిటీ మరియు సమర్థత ప్రాతిపదికన సాయిప్రసాద్‌ను ప్రభుత్వం ఈ ఉన్నత పదవికి ఎంపిక చేసింది. వాస్తవానికి 2025 నవంబరు 29వ తేదీనే ఆయనను సీఎస్‌గా నియమిస్తూ ప్రభుత్వం ముందస్తు ఉత్తర్వులు జారీ చేసింది. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న క్లిష్ట పరిస్థితులను చక్కదిద్దడంలోనూ, ప్రభుత్వ ప్రాధాన్యతలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలోనూ సాయిప్రసాద్ తనదైన ముద్ర వేశారు. సాయిప్రసాద్ నేపథ్యం మరియు ఆయన కెరీర్ గ్రాఫ్‌ను పరిశీలిస్తే, ఆయన ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మట్టిగుంట గ్రామంలో ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. 1991లో ఐఏఎస్ అధికారిగా ఎంపికైన తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ, ఆ తర్వాత నవ్యాంధ్రప్రదేశ్ లోనూ ఆయన అనేక కీలక పదవులను అధిష్టించారు. ముఖ్యంగా 2024 జూన్ నుండి జలవనరుల శాఖ కార్యదర్శిగా పనిచేస్తూ రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షించారు. 2025 జనవరిలో ముఖ్యమంత్రికి ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమితులై, సీఎం కార్యాలయంలో అత్యంత కీలకమైన పాత్రను పోషించారు. దీనికి అదనంగా రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కూడా ఆయన సేవలందిస్తున్నారు. గతంలో (201924 మధ్య) ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్ సీఎండీగా మరియు ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేసిన సమయంలో పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధిలో ఆయన విశేష కృషి చేశారు. సీసీఎల్ఏగా భూ పరిపాలనలో తీసుకొచ్చిన సంస్కరణలు కూడా ఆయన సమర్థతకు నిదర్శనం. కేంద్రం నుంచి వచ్చిన ఈ పొడిగింపు ఉత్తర్వులతో రాష్ట్ర అధికార యంత్రాంగంలో స్థిరత్వం ఏర్పడనుంది. సాధారణంగా ఎన్నికల సంవత్సరంలో లేదా కీలక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్న సమయంలో ప్రభుత్వం సీనియర్ అధికారుల పొడిగింపును కోరుతుంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలో బడ్జెట్ రూపకల్పన, అమరావతి రాజధాని పనులు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వంటి కీలక ఘట్టాలు జరుగుతున్న తరుణంలో, ప్రభుత్వానికి విశ్వసనీయమైన మరియు విషయ పరిజ్ఞానం ఉన్న అధికారి సీఎస్ స్థానంలో ఉండటం అవసరమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. సాయిప్రసాద్ పట్ల అటు రాజకీయ వర్గాల్లోనూ, ఇటు అధికారుల వర్గాల్లోనూ మంచి పేరు ఉండటంతో ఈ పొడిగింపు నిర్ణయం ఏకగ్రీవంగా ఆమోదయోగ్యం పొందింది. నవంబర్ వరకు ఆయన పర్యవేక్షణలో మరిన్ని విప్లవాత్మక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉందని సచివాలయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ ఆరు నెలల పొడిగింపుతో ఆయన మొత్తం సర్వీసులో కీలకమైన మైలురాయిని చేరుకోనున్నారు.

# ఏపీలో విద్యారంగ విప్లవం

- 19 వర్సిటీల్లో 1,523 అధ్యాపక పోస్టుల భర్తీకి భారీ నోటిఫికేషన్
- ఉద్యోగ క్యాలెండర్‌లో వాగ్దానాన్ని నిలబెట్టుకున్న ప్రభుత్వం: మంత్రి లోకేశ్



**అమరావతి వెలుతురు మే 15:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఉన్నత విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తూ, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు భరోసా కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 19 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలతో పాటు రాజీవ్ గాంధీ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) లలో ఖాళీగా ఉన్న 1,523 అధ్యాపక పోస్టుల భర్తీకి ప్రభుత్వం శుక్రవారం అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేరుస్తూ, ఉద్యోగ క్యాలెండర్‌లో ప్రకటించిన గడువు లోపలే ఈ ప్రక్రియను ప్రారంభించడం పట్ల విద్యార్థి లోకం మరియు నిరుద్యోగ అభ్యర్థుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, ఇది ఏపీ భవిష్యత్తు కోసం ప్రభుత్వం పెడుతున్న నిర్ణయాత్మక పెట్టుబడి అని అభివర్ణించారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ఎక్కడా అవినీతికి తావులేకుండా పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ భారీ నోటిఫికేషన్ ద్వారా అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లు మరియు లెక్చరర్ల పోస్టులను భర్తీ చేయనున్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న తీవ్రమైన ఫ్యాకల్టీ కొరతను దృష్టిలో ఉంచుకుని ఈ నోటిఫికేషన్ రూపొందించారు. గణాంకాల ప్రకారం, రాష్ట్రంలోని వర్సిటీల్లో మొత్తం 4,343 పోస్టులు మంజూరు కాగా, ప్రస్తుతం కేవలం 972 మంది అధ్యాపకులు మాత్రమే సేవలందిస్తున్నారు. ఈ భారీ అంతరాన్ని తగ్గించడమే కాకుండా, విద్యా ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలన్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రి లోకేశ్ వివరించారు. ఈ నియామకాల వల్ల విశ్వవిద్యాలయాల్లో బోధనతో పాటు పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలు ఊపందుకుంటాయని, తద్వారా జాతీయ స్థాయి ఎన్ఏఏసీ ర్యాంకింగ్‌లలో మన వర్సిటీలు మెరుగైన స్థానాలను దక్కించుకుంటాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేవలం బోధనకే పరిమితం కాకుండా, తర్వాతి తరం మార్గదర్శకులుగా, దేశ నిర్మాతలుగా ఎదిగే ప్రతిభావంతులైన అభ్యర్థులను ఎంపిక చేయడమే ఈ నోటిఫికేషన్ ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఈ మొత్తం ప్రక్రియలో ప్రతిభకే పెద్దపీట వేస్తామని ప్రభుత్వం గట్టిగా చెబుతోంది.

ఈ నోటిఫికేషన్‌లో సామాజిక న్యాయానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. మొత్తం ఖాళీలలో 279 బ్యాక్‌లాగ్ పోస్టులను చేర్చడం ద్వారా అన్ని వర్గాల వారికి సమాన అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకున్నారు. ఇక పోస్టుల వివరాల్లోకి వెళితే, అత్యధికంగా 1,020 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఉన్నాయి. వీటితో పాటు 334 అసోసియేట్ ప్రొఫెసర్లు, 63 ప్రొఫెసర్లు మరియు 104 లెక్చరర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. సుదీర్ఘ కాలంగా విశ్వవిద్యాలయాల్లో సేవలందిస్తున్న ఒప్పంద (కాంట్రాక్ట్) అధ్యాపకులకు కూడా ప్రభుత్వం తీపి కబురు అందించింది. వారి అనుభవాన్ని మరియు సేవలను గుర్తించి, నియామక ప్రక్రియలో అర్హత గల సేవా సంవత్సరాలకు అదనపు ప్రాధాన్యతను (వెయిటేజీ) కల్పించాలని నిర్ణయించింది. దీనివల్ల ఎంతో కాలంగా తమ భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్న ఒప్పంద అధ్యాపకులకు రక్షణ మరియు గుర్తింపు లభించనుంది. పారదర్శకమైన మరియు ప్రతిభ ఆధారిత ప్రక్రియ ద్వారానే ఈ నియామకాలు జరుగుతాయని ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. అర్హత కలిగిన అభ్యర్థులు మే 18, 2026 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. అభ్యర్థులు తమ దరఖాస్తులను universitiesrecruitment.apcfss.in అనే వెబ్‌సైట్‌లో సమర్పించాల్సి ఉంటుంది. పోస్టులకు సంబంధించిన విద్యార్హతలు, వయోపరిమితి, రిజర్వేషన్లు మరియు ఇతర పూర్తి వివరాల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా naipunyam.ap.gov.in/jobcalendar అనే పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఈ పవిత్రమైన వృత్తిలో చేరాలనుకునే వారు అంకితభావంతో, విద్యాపరమైన నిబద్ధతతో సిద్ధం కావాలని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు. తదుపరి తరం పరిశోధకులుగా, అధ్యాపకులుగా ఎదిగేందుకు ఇదొక సువర్ణావకాశమని ఆయన పేర్కొన్నారు. నియామక ప్రక్రియను నిర్ణీత కాలపరిమితిలోగా పూర్తి చేసి, నూతన విద్యా సంవత్సరం నాటికి అధ్యాపకులను వర్సిటీల్లో నియమించడమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేస్తోందని ప్రభుత్వం వెల్లడించింది. ఈ నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాలు మునుపెన్నడూ లేనంత బలోపేతం అవుతాయని విద్యారంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# జాతీయ జనాభా లెక్కల్లో ఓబీసీల ఊసేది?




తెలంగాణ 'కుల సర్వే' సాక్షిగా దేశం ముందు నిలిచిన అసలు ప్రశ్న! భారతదేశం ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం. మన రాజ్యాంగం అందరికీ సమానత్వం, సామాజిక న్యాయం అందించాలని చెబుతోంది. కానీ, దేశంలోనే అత్యధిక జనాభా కలిగిన ఇతర వెనుకబడిన వర్గాల (ఓబీసీలు) సంఖ్య ఎంత అన్నది ఇప్పటికీ ప్రభుత్వ లెక్కల్లో లేకపోవడం పెద్ద లోపంగా కనిపిస్తోంది. ఎన్నికలు వచ్చినా, పథకాలు ప్రకటించినా 'ఓబీసీ'ల గురించే చర్చ. కానీ ఒక ప్రాథమిక ప్రశ్నకు మాత్రం సమాధానం లేదు: "దేశంలో ఓబీసీల జనాభా ఎంత?" ఇది కేవలం నంబర్ల గొడవ కాదు... మెజార్టీ ప్రజల హక్కులు, అవకాశాలు, సామాజిక న్యాయానికి సంబంధించిన ప్రశ్న.

**1931 తర్వాత లెక్కలేవు!**

మన దేశంలో చివరిసారిగా పూర్తిస్థాయి కులాల జనాభా లెక్కలు సేకరించింది బ్రిటీష్ కాలంలో, అంటే 1931లో. స్వాతంత్ర్యం వచ్చాక ఎస్సీ, ఎస్టీ జనాభాను మాత్రమే అధికారికంగా లెక్కిస్తున్నారు. దేశంలోనే అతిపెద్ద వర్గమైన బీసీలపై కేంద్ర ప్రభుత్వం దగ్గర సరైన లెక్కలు లేవు. "ఇంత పెద్ద సామాజిక వర్గాన్ని అధికారికంగా దాచడం ఎంతవరకు న్యాయం?" అనే డిమాండ్ ఇప్పుడు ఊపందుకుంది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా పార్లమెంట్‌లో ఈ విషయాన్ని గట్టిగా లేవనెత్తారు. "ఎవరి జనాభా ఎంతో తెలియకుండా, వాళ్లకు న్యాయం ఎలా చేస్తారు?" అని ఆయన ప్రశ్నించారు. ఉద్యోగాలు, విద్య, బడ్జెట్ కేటాయింపుల్లో నిజమైన సామాజిక న్యాయం జరగాలంటే దేశవ్యాప్తంగా కుల గణన జరిగి తీరాలన్నది ఆయన వాదన. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు ఇస్తూ కేంద్రం బిల్లు తెచ్చినప్పుడు కూడా ఈ చర్చ మరింత వేడెక్కింది. ఇందులో ఓబీసీ మహిళలకు ప్రత్యేక కోటా ఎందుకు ఇవ్వలేదనే ప్రశ్నలొచ్చాయి. మహిళా సాధికారత అంటే కేవలం సీట్లు ఇవ్వడం కాదు, అందులోనూ సామాజిక న్యాయం ఉండాలనే డిమాండ్ వినిపించింది. కానీ, కేంద్రం ఎందుకు ఈ విషయంలో వెనుకాడుతోందన్న అంశంపై ఖచ్చితంగా సమాధానం చెప్పాలి. కులాల వారీగా లెక్కలు తీస్తే సమాజం విడిపోతుందనేది బీజేపీ వాదన. అయితే, అసలు జనాభా ఎంతో తేలితే... దేశంలోని రాజకీయం, ఆర్థికం, అధికారాల్లో ఎవరి వాటా ఎంత ఉందో, ఎవరి ఆధిపత్యం నడుస్తుందో స్పష్టంగా తెలిసిపోతుందనేది ప్రజాస్వామ్యవాదుల అభిప్రాయం.

**దేశానికి దిక్సూచిగా తెలంగాణ సర్వే-2024**

గతంలో ఒక నినాదం దేశ రాజకీయాల్లో ప్రబలంగా ఉండేది. ఈరోజు బెంగాల్ ఏం చేస్తుందో... రేపు భారతం చేస్తుందన్నది. కానీ, నేడు దేశ రాజకీయ యవనికను తెలంగాణ నిర్దేశిస్తుంది.

**బీసీల కులగణన విషయంలో...**

తెలంగాణ, యావత్ దేశానికి మార్గదర్శిగా నిలిచింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం 2024లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వే" దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసింది. ఇటీవల (2026 ఏప్రిల్‌లో) విడుదలైన ఈ నివేదిక ప్రకారం... తెలంగాణ జనాభాలో బీసీలు ఏకంగా 56.34% నుంచి 56.36% వరకు ఉన్నారు. ఇందులో బీసీ ముస్లింలు 10.08% గా ఉన్నారు. ఈ లెక్కలతో తెలంగాణలో బీసీలే అతి పెద్ద సామాజిక వర్గమని అధికారికంగా తేలిపోయింది. ఈ సర్వేతో ఎన్నో విషయాలు తెలిశాయి. "సామాజిక న్యాయం జరగాలంటే... ఖచ్చితమైన సమాచారం (డేటా) ఉండాలి. కేంద్ర ప్రభుత్వం వెనుకాడుతున్న తరుణంలో, తెలంగాణ ప్రభుత్వం ధైర్యంగా ఈ సామాజిక వాస్తవాలను ప్రజల ముందు పెట్టింది. బీసీలు ఇంత పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ... రాజకీయ, ఆర్థిక రంగాల్లో వారికి దక్కాల్సిన వాటా ఇంకా రాలేదని ఈ సర్వే నిరూపించింది.


**ఓబీసీ లెక్కలు లేని జనగణన... 'అంధ గణన'!**

ఓబీసీలను లెక్కించకుండా దేశంలో జనాభా లెక్కలు సేకరిస్తే దానికి అర్థమే లేదు. అది సమాజ రూపురేఖలను పూర్తిగా చూపించలేదు. అసమానతలను, వెనుకబాటుతనాన్ని దాచిపెట్టే ఈ ప్రక్రియను 'అంధ గణన' (గుడ్డి లెక్కలు) అనక తప్పదు. "సామాజిక న్యాయం లేని రాజకీయ ప్రజాస్వామ్యం అసంపూర్ణం" అని బాబాసాహెబ్ అంబేద్కర్ నాడే చెప్పారు. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఓటు వేయడం కాదు... దేశంలో తమ ఉనికిని గుర్తించడం, జనాభా ప్రకారం వాటా పొందడం కూడా. తెలంగాణ లాంటి ఒక రాష్ట్రం కుల సర్వే చేయగలిగినప్పుడు... కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఓబీసీ కుల గణన ఎందుకు చేయలేకపోతోంది? దేశం ఓబీసీలను కేవలం 'ఓటర్లు'గానే చూస్తుందా, లేదా 'భాగస్వాములు'గా గుర్తిస్తుందా? మెజార్టీ ప్రజలను లెక్కల్లో చూపించని వ్యవస్థకు సమానత్వం గురించి మాట్లాడే నైతిక హక్కు ఉంటుందా?



డాక్టర్ లోలపు తిరుపతి,
పాలసీ ఎనలిస్ట్.

# ఆదర్శ పాఠశాల ప్రాంగణంలో ఘనంగా గ్రంథాలయ దినోత్సవం




**గుండాల, మే 15 (వెలుతురు):**
యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని ఆదర్శ పాఠశాలలో సమ్మర్ క్యాంప్ కార్యక్రమంలో భాగంగా ఐదవ రోజు గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల గ్రంథాలయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పుస్తక పఠన కార్యక్రమాలు చేపట్టారు. పుస్తక పఠనం ద్వారా విద్యార్థుల్లో జ్ఞానవృద్ధి, ఆలోచనా శక్తి, వ్యక్తిత్వ వికాసం పెరుగుతాయని ఉపాధ్యాయుడు బొజ్జా సురేష్ విద్యార్థులకు విపులంగా వివరించారు. పుస్తకాలు మనిషికి మంచి మిత్రులని, ప్రతి రోజు చదివే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుంట రమేష్ కుమార్, దశరథ్, అనిత, మహేష్, సంతోష, మౌనిక తదితరులు పాల్గొని విద్యార్థులకు పుస్తకాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు కూడా ఉత్సాహంగా పాల్గొని పుస్తక పఠనంపై ఆసక్తి కనబరిచారు.

# సహకార రంగ బలోపేతానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది: ప్రధాన కార్యదర్శి

**హైదరాబాద్ వెలుతురు మే 15:** తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ కె. రామకృష్ణ రావు, ఐఏఎస్ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి సహకార అభివృద్ధి సమన్వయ కమిటీ (SCDC) సమావేశం హైదరాబాద్‌లో నిర్వహించబడింది. ఈ సమావేశానికి భారత ప్రభుత్వ సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి Dr. Ashish Kumar Bhutani, అదనపు కార్యదర్శి Siddharth Jain, డైరెక్టర్ Sathiyaతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సహకార శాఖ కార్యదర్శి Surendra Mohan తెలంగాణలో సహకార రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలను వివరించారు. కేంద్ర సహకార మంత్రిత్వ శాఖతో సమన్వయంతో 'Whole of Government Approach' ద్వారా సహకార రంగాన్ని బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు.



**పీఏసీఎస్ కంప్యూటరీకరణలో తెలంగాణ ముందంజ** తెలంగాణ ప్రభుత్వం PACS కంప్యూటరీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించి, నిర్ణిత సమయంలో ఆడిట్ పూర్తిచేసి, లావాదేవీలలో పారదర్శకత, ఓటర్ల జాబితా డిజిటలైజేషన్, రుణ మరియు రుణేతర వ్యాపారాల విస్తరణ వంటి అనేక ప్రయోజనాలు సాధించిందని ఆయన తెలిపారు. ఈ పథకానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన పెండింగ్ నిధులను మంజూరు చేయాలని కోరారు.

**ప్రపంచంలోనే అతిపెద్ద ధాన్య నిల్వ పథకం**
World's Largest Grain Storage Plan (WLGSP) కింద తెలంగాణలో 10 జిల్లాల్లో 3 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇప్పటికే 34 ప్రదేశాలను (17 PACS, 17 Telangana State Cooperative Marketing Federation Limited) గుర్తించి, 1.4 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాముల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు.



**యువతకు సహకార రంగ పరిచయం**
వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారి సూచనలతో సహకార రంగంపై యువతలో అవగాహన పెంపొందించేందుకు రాష్ట్రంలో Cooperative Internship Programme అమలు చేసి, సుమారు 150 మంది విద్యార్థులకు సహకార సంస్థల పనితీరుపై ప్రత్యక్ష అనుభవం కల్పించినట్లు తెలిపారు. అలాగే సహకార క్లబ్‌లను ఏర్పాటు చేసి, సమాజాభివృద్ధిలో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు.

**తెలంగాణ సహకార విధానం రూపకల్పన**
'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ కి అనుగుణంగా, National Bank for Agriculture and Rural Development సహకారంతో రాష్ట్ర సహకార విధానాన్ని రూపొందించాలని మంత్రిగారు సూచించారని, దానికనుగుణంగా ఈకోర్టు సౌకర్యం, కృత్రిమ మేధస్సు ఆధారిత పాలన, తెలంగాణ కోఆపరేటివ్ అకాడమీ స్థాపన వంటి అంశాలు ప్రతిపాదించబడినట్లు వెల్లడించారు.

**గోదాములు, బ్యాంకింగ్, సౌరశక్తి, ఎఫ్‌పీవోలు**
రాష్ట్రంలో ధాన్యం, మొక్కజొన్న తదితర పంటల కొనుగోళ్లను దృష్టిలో ఉంచుకుని భారీ గోదాముల నిర్మాణానికి కార్యాచరణ రూపొందించామని తెలిపారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు (DCCBs), Telangana State Cooperative Apex Bank Limited మరియు పట్టణ సహకార బ్యాంకుల ద్వారా చేపట్టిన బ్యాంకింగ్ కార్యక్రమాలను వివరించారు. సహకార సంఘాల ద్వారా ఎలక్ట్రిక్ వాహన ఛార్జింగ్ స్టేషన్లు, సౌర విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో 311 రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (FPOs) కొత్త వ్యాపార కార్యకలాపాలతో పనిచేస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రస్తుతం ఉన్న PACSలను బహుళ ప్రయోజన సహకార సంఘాలుగా (Multipurpose PACS) విస్తరించేందుకు ప్రతిపాదనకు ఆమోదం తెలపాలని SCDC కమిటీని కోరారు.

**పాల, మత్స్య సహకార సంఘాలకు తెలంగాణలో అపార అవకాశాలు**
కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ సిద్ధార్థ్ జైన్ తెలంగాణలో పాల మరియు మత్స్య సహకార సంఘాల విస్తరణకు విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపర్చేందుకు వ్యూహాత్మక జలాశయాలను గుర్తించి మత్స్య సహకార సంఘాలను బలోపేతం చేయాలని సూచించారు.

**గోదాముల నిర్మాణంలో PACS పాత్ర పెంచాలి**
కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి డా. అశీష్ కుమార్ భూటాని ప్రపంచంలోనే అతి పెద్ద ధాన్య నిల్వ పథకం ప్రాముఖ్యతను వివరించారు. Food Corporation of India (FCI) అవసరమున్న ప్రాంతాలను గుర్తించిందని తెలిపారు. వ్యవసాయ మౌలిక వసతుల నిధి (AIF) కింద 3 శాతం వడ్డీ సబ్సిడీ, CGTMSE కింద రూ.2 కోట్ల వరకు భరోసా వంటి ప్రయోజనాలను వివరించారు. మరిన్ని PACS లు గోదాముల నిర్మించడంలో పాల్గొనాలని సూచించారు. అలాగే, ఇటీవల స్థాపించబడిన Tribhuvan Sahakari University తరహాలో తెలంగాణలో రాష్ట్ర సహకార విశ్వవిద్యాలయం ఏర్పాటు అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు.

**సహకార రంగం సమగ్రాభివృద్ధికి కీలకం**
సమావేశాన్ని ఉద్దేశించి ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచే సహకార ఉద్యమానికి గొప్ప చరిత్ర ఉందని గుర్తుచేశారు. దేశంలో ప్రత్యేక సహకార మంత్రిత్వ శాఖ ఏర్పాటు మరియు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రిగారి చొరవతో PACS బలోపేతానికి కొత్త ఊతం లభించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా PACSలకు అదనపు ఆదాయ వనరులు లభిస్తున్నాయని, దీని ద్వారా వాటి లాభదాయకత, దీర్ఘకాలిక స్థిరత్వం పెరుగుతుందని పేర్కొన్నారు. WLGSP కింద FCIతో అద్దె ఒప్పందాలు కుదుర్చుకోవడం వంటి అవకాశాలు రాష్ట్రానికి ఉపయోగకరమని చెప్పారు. పశుసంవర్ధక రంగం స్థూల దేశీయోత్పత్తికి విశేషంగా దోహదపడుతోందని, మత్స్యరంగానికి కూడా సముచిత ప్రోత్సాహం అవసరమని పేర్కొన్నారు. పేద, సన్నకారు రైతుల సమగ్రాభివృద్ధికి సహకార రంగం కీలకమని, తెలంగాణలో సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందని ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు.

---

# పరిశ్రమల హబ్ గా సంగారెడ్డి




- **కేజేఎస్ పరిశ్రమతో 1,600 మందికి ఉపాధి**
- **పారిశ్రామికాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది: జగ్గారెడ్డి**
- **సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో వేగంగా పరిశ్రమల స్థాపన**

**సంగారెడ్డి వెలుతురు మే 15:** సంగారెడ్డి ప్రాంతాన్ని పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని టీజీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని పరిశ్రమలను తీసుకువచ్చి స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. సంగారెడ్డి నియోజకవర్గం కొండాపూర్ మండలం తొగర్‌పల్లి గ్రామంలో శుక్రవారం కేజేఎస్ పరిశ్రమ నిర్మాణానికి నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ..దేశంలో పారిశ్రామికాభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఎప్పటి నుంచో ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇందిరాగాంధీ కాలం నుంచే పరిశ్రమల స్థాపన, ఉద్యోగ అవకాశాల విస్తరణ, ఆర్థికాభివృద్ధిపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి సారించిందని గుర్తుచేశారు. అదే దిశగా ప్రస్తుతం తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. కేజేఎస్ పరిశ్రమ స్థాపనతో సంగారెడ్డి ప్రాంతానికి కొత్త గుర్తింపు వస్తుందని, ప్రత్యక్షంగా సుమారు 1,600 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని చెప్పారు. పరోక్షంగా మరెంతో మందికి జీవనోపాధి కలుగుతుందని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుతో స్థానికంగా రవాణా, వాణిజ్యం, చిన్న వ్యాపారాలు, సేవారంగం అభివృద్ధి చెందుతాయని అభిప్రాయపడ్డారు. సంగారెడ్డి ప్రాంతంలో పరిశ్రమల స్థాపన కోసం గత ఏడాది కాలంగా నిరంతరం కృషి చేస్తున్నామని జగ్గారెడ్డి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత శాఖలతో అనేక సమావేశాలు నిర్వహించి పెట్టుబడిదారులను ఆకర్షించే ప్రయత్నాలు చేశామని తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారం వల్లే ఈ ప్రాజెక్టులు వేగంగా ముందుకు సాగుతున్నాయని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. పారిశ్రామిక రంగ అభివృద్ధిపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో పనిచేస్తోందని, పెట్టుబడులకు తెలంగాణ అనుకూల రాష్ట్రంగా మారిందన్నారు.

కేజేఎస్ పరిశ్రమ రాకతో సంగారెడ్డి జిల్లా పారిశ్రామికంగా మరింత పురోగతి సాధిస్తుందని స్థానిక ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. యువతకు ఉపాధి అవకాశాలు స్థానికంగానే లభించడం వల్ల వలసలు తగ్గే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. పరిశ్రమల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక చైతన్యం పెరుగుతుందని పేర్కొంటున్నారు. భూమిపూజ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. తెలంగాణను పెట్టుబడులకు అత్యంత అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. పరిశ్రమలకు అనుమతులు వేగంగా మంజూరు చేయడంతో పాటు అవసరమైన సదుపాయాలన్నీ ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. పరిశ్రమలు ఏర్పడితేనే యువతకు ఉద్యోగాలు, రాష్ట్రానికి ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా పారిశ్రామికాభివృద్ధిలో ముందంజలో నిలిచేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మెడికల్, ఫార్మా, తయారీ రంగాల్లో మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. స్థానిక ప్రజలకు ఉపాధి కల్పించే సంస్థలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు సురేష్ షెట్కార్, మాధవనేని రఘునందన్‌రావు, ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, కేజేఎస్ సంస్థ ఎండీ గిరీష్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. భూమిపూజ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై పరిశ్రమ నిర్మాణానికి స్వాగతం పలికారు. పరిశ్రమలు పెరిగితే సంగారెడ్డి ప్రాంత ఆర్థిక పరిస్థితి మరింత బలోపేతం అవుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు భవిష్యత్తులో రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకెళ్తాయని నాయకులు పేర్కొన్నారు.

---

# గ్లోబల్ ఎక్స్ పోర్ట్స్ హబ్ గా తెలంగాణ

- **ఇంజనీరింగ్ ఎగుమతుల వృద్ధిలో కీలకంగా రాష్ట్రం**
- **టెక్నాలజీ, మ్యానుఫ్యాక్చరింగ్ ఎకో సిస్టం అనుసంధానంపై ప్రత్యేక దృష్టి**
- **"ఈఈపీసీ ఇండియా సదరన్ రీజియన్ అవార్డ్స్ ఫర్ ఎక్స్ పోర్ట్" కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్ వెలుతురు మే 15:** ఇంజనీరింగ్ ఎగుమతుల్లో తెలంగాణ అద్భుత ప్రగతి సాధిస్తోందని, రాష్ట్రాన్ని గ్లోబల్ ఎక్స్ పోర్ట్స్ హబ్‌గా మార్చేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇండస్ట్రియల్ పార్కులు, ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు, లాజిక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, స్కిల్లింగ్ ఎకో సిస్టం, ఇన్నోవేషన్ నెట్ వర్క్స్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించామని వివరించారు. శుక్రవారం బేగంపేట్ ఐటీసీ కాకతీయలో నిర్వహించిన "48వ ఈఈపీసీ ఇండియా సదరన్ రీజియన్ అవార్డ్స్ ఫర్ ఎక్స్ పోర్ట్" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... 2024-25లో భారత్ నుంచి ఇంజనీరింగ్ ఎగుమతులు రికార్డు స్థాయిలో 116.67 బిలియన్ డాలర్లు దాటాయన్నారు. ఇది మొత్తం మర్చండైస్ ఎగుమతుల్లో 27 శాతానికి చేరుకోవడం మన ఆర్థిక వ్యవస్థ పరిణతికి నిదర్శనమన్నారు. దేశ ఇంజనీరింగ్ ఎగుమతుల వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందంజలో ఉందన్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, ఫార్మా, ఈవీ మొబిలిటీ తదితర రంగాల్లో జాతీయ స్థాయిలో మన వాటా రోజురోజుకీ పెరుగుతోందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ ఇంజనీరింగ్ ఎగుమతులు 7.5 బిలియన్ డాలర్లకు చేరుకోవడం ఇక్కడి పారిశ్రామికాభివృద్ధికి నిదర్శనమన్నారు. గతంలో మ్యానుఫ్యాక్చరింగ్, టెక్నాలజీ వేర్వేరు అని, ఇప్పుడు మాత్రం ఆ రెండింటిని అనుసంధానిస్తేనే గ్లోబల్ సప్లై చైన్ లో కీలక పాత్ర పోషించగలమన్నారు. ఆ దిశగా "మేడ్ ఇన్ తెలంగాణ" బ్రాండ్ ను మరింత విశ్వవ్యాప్తం చేసేలా ఏఐ, ఆటోమేషన్, రోబోటిక్స్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ తో కూడిన ఎకో సిస్టమ్ ను అందుబాటులోకి తెచ్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. ఎక్స్ పోర్ట్ రంగానికి అవసరమైన "రెడీ టూ వర్క్ ఫోర్స్"ను అందించే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని సంబంధిత దిగ్గజ పారిశ్రామికవేత్తలను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆహ్వానించారు. హైదరాబాద్ లో ఈఈపీసీ ప్రాంతీయ కార్యాలయాన్ని పునః ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నీతి ఆయోగ్ మాజీ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం, ఈఈపీసీ ఇండియా ప్రతినిధులు పంకజ్ చాడ, రామన్ రఘు, శశి లూయిస్ తదితరులు పాల్గొన్నారు.




---

# నందనం గ్రామ విద్యార్థిని స్వాతి SSC లో సత్తా

- **నందనం స్వాతి SSCలో 563 మార్కులు సాధించి ద్వితీయ స్థానం**

**భువనగిరి వెలుతురు మే 15:** ZPHS టేకుల సోమవారం స్కూల్ విద్యార్థినిగా ప్రతిభ రమేష్ – ప్రమీల దంపతుల కుమార్తెగా గర్వకారణం భువనగిరి మండల ఫలితాల్లో ఉత్తమ ప్రదర్శన గ్రామంలో అభినందనలు వెల్లువెత్తిన వాతావరణం సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సన్మాన కార్యక్రమం పాలకవర్గం, బీఆర్ఎస్ నాయకుల పాల్గొనడం. మాజీ సర్పంచ్, జిల్లా నాయకుల హాజరు, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దల శుభాకాంక్షలు
విద్యార్థుల కృషికి గ్రామం నుండి ప్రశంసల జల్లు. నందనం గ్రామానికి చెందిన విద్యార్థిని కొండాపురం స్వాతి ఎస్ఎస్‌సీ పరీక్షల్లో ప్రతిభ చూపి గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. భువనగిరి మండలం పరిధిలో జరిగిన ఇటీవల



SSC ఫలితాల్లో ఆమె 563 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. కొండాపురం రమేష్, ప్రమీల దంపతుల కుమార్తె అయిన స్వాతి, ప్రభుత్వ జెడ్పీహెచ్ఎస్ టేకుల సోమవారం స్కూల్‌లో చదువుతోంది. కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించిన ఆమెకు గ్రామస్థాయిలో అభినందనలు వెల్లువెత్తాయి. ఈ విజయాన్ని పురస్కరించుకుని నందనం గ్రామ సర్పంచ్ నాగెల్లి గిరిజ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం, బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ కడమంచి ప్రభాకర్, జిల్లా నాయకులు మట్ట ధనుంజయ్ గౌడ్‌తో పాటు పలువురు గ్రామ పెద్దలు కార్యక్రమంలో పాల్గొన్నారు. వార్డు మెంబర్లు కంటేశ్వర ఓంకార్, కొలను పెంటారెడ్డి, మట్ట కుమార్, గ్రామ శాఖ అధ్యక్షులు మోలుగు నాగరాజ్, మట్ట బాలకృష్ణ గౌడ్, కొండాపురం శ్రీను, కొత్తపల్లి అందే రాములు, శ్రీను, మట్ట సంతోష్‌గౌడ్, అల్లంపల్లి కృష్ణ తదితరులు స్వాతిని అభినందించి శాలువా కప్పి సత్కరించారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ స్వాతి సాధించిన ఫలితం గ్రామానికి గర్వకారణమని, ఇలాంటి విద్యార్థులు మరింత ముందుకు వెళ్లి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యార్థినికి శుభాకాంక్షలు తెలిపారు.

---

# నీట్ పేపర్ లీక్ కేసులో సంచలనం



- **పేపర్ సెట్టింగ్ కమిటీ సభ్యుడే సూత్రధారి**
- **సీబీఐ చేతికి 'కెమిస్ట్రీ' ప్రొఫెసర్**
- **పుణెలో కీలక సూత్రధారి అయిన ప్రొఫెసర్ అరెస్ట్**
- **కెమిస్ట్రీ ప్రశ్నపత్రాల రూపకల్పన కమిటీ సభ్యుడి నిందితుడు**
- **సభ్యుడిగా ఉంటూనే కుట్రకు తెరలేపిన పీవీ కులకర్ణి**
- **సొంత ఇంట్లోనే రహస్యంగా కోచింగ్**

**న్యూఢిల్లీ వెలుతురు మే 15:** దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న నీట్‌యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ భారీ కుంభకోణంలో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న రసాయన శాస్త్ర (కెమిస్ట్రీ) నిపుణుడు, ప్రొఫెసర్ పీవీ కులకర్ణిని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) శుక్రవారం పుణెలో అరెస్ట్ చేసింది. అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, నిందితుడు కులకర్ణి గత కొన్నేళ్లుగా నీట్ ప్రశ్నపత్రాలను రూపొందించే అధికారిక 'పేపర్ సెట్టింగ్ కమిటీ'లో సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఒకవైపు ప్రభుత్వ కమిటీలో ఉంటూనే, మరోవైపు పుణెలోని తన నివాసంలో రహస్యంగా విద్యార్థులకు కోచింగ్ ఇస్తున్నట్లు అధికారుల విచారణలో తేలింది. ప్రశ్నపత్రాల తయారీపై పూర్తి అవగాహన, యాక్సెస్ ఉన్న ఆయన, ఆ అధికారాన్ని అడ్డం పెట్టుకుని విద్యార్థుల నుంచి భారీగా వసూలు చేసి పేపర్ లీక్ చేసినట్లు సీబీఐ నిర్ధారించింది.

దర్యాప్తు వివరాల ప్రకారం.. ప్రొఫెసర్ కులకర్ణి తన సహచరురాలు మనీషా వాఘ్మారే సాయంతో 2026 ఏప్రిల్ చివరి వారంలోనే ఒక పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేశారు. భారీ సంఖ్యలో విద్యార్థులను సమీకరించి, వారికి తన కోచింగ్ సెంటర్‌లో నీట్ పరీక్షలో వచ్చే ప్రశ్నలను ముందే లీక్ చేశారు. కేవలం ప్రశ్నలే కాకుండా, వాటికి సంబంధించిన ఆప్షన్లు మరియు సరైన సమాధానాలను కూడా ఆయన స్వయంగా విద్యార్థులకు డిక్టేట్ చేశారు. విద్యార్థులు తమ నోట్‌బుక్‌స్‌లో రాసుకున్న ఈ చేతిరాత నోట్స్, మే 3వ తేదీన జరిగిన అసలు నీట్ పరీక్షా పత్రంతో 100 శాతం సరిపోలడం అధికారులను విస్మయానికి గురిచేసింది. అంటే పరీక్షకు ముందే విద్యార్థులకు ప్రశ్నపత్రం మొత్తం తెలిసిపోయిందన్నమాట. ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించిన మనీషా వాఘ్మారేను మే 14నే సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ లీకేజీ బాగోతం బయటపడటానికి లాతూర్‌లోని ఒక ప్రైవేట్ కోచింగ్ సెంటర్ నిర్వహించిన మాక్ టెస్ట్ కారణమైంది. సదరు సెంటర్ నిర్వహించిన మాక్ టెస్ట్‌లో ఇచ్చిన 42 ప్రశ్నలు, అసలు నీట్ పరీక్షలో వచ్చిన ప్రశ్నలతో అచ్చుగుద్దినట్లు సరిపోలడంతో ఒక విద్యార్థి తండ్రికి అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రాథమిక విచారణ జరిపిన పోలీసులు, సీసీటీవీ ఫుటేజీలు మరియు కౌన్సిలర్ల వాంగ్మూలాలను సేకరించారు. కేసు తీవ్రత దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం దర్యాప్తును సీబీఐకి అప్పగించింది. రంగంలోకి దిగిన సీబీఐ అధికారులు ఇప్పటికే నాసిక్‌కు చెందిన శుభమ్ ఖైర్నార్, అహిల్యానగర్‌కు చెందిన ధనంజయ్ లోఖండేలను అరెస్ట్ చేశారు. ప్రతిష్టాత్మక కళాశాలల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన కులకర్ణి వంటి వారు ఇలాంటి అక్రమాలకు పాల్పడటం విద్యా వ్యవస్థనే కలవరపెడుతోంది. పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 12న రద్దయిన నీట్‌యూజీ పరీక్షను తిరిగి జూన్ 21న నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. దీనికి సంబంధించి జూన్ 14న అడ్మిట్ కార్డులు విడుదల చేయనున్నారు. పునఃపరీక్ష రాసే విద్యార్థులు మళ్లీ ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని, పరీక్షా కేంద్రాల వివరాలను త్వరలోనే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని ఎన్టీఏ స్పష్టం చేసింది. మరోవైపు, ఇటువంటి మాల్ ప్రాక్టీస్ ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్షను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహిస్తామని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకునే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ఈ కేసులో లోతైన విచారణ జరిపి దోషులందరికీ కఠిన శిక్ష పడేలా చూస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

# వడియాలు.. దప్పళాలు..

అసలు కంటే కొసరు ముద్దు అన్నారు. అది అక్షరాలా నిజం. భోజనంలో కూర, చారు, పులుసు, పచ్చడి ఎన్నున్నా.. వడియాలు, అప్పడాల మీదికి ధ్యాస పోతుంది. చెప్పాలంటే.. వాటితో పదార్థాలకు మరింత రుచి, వైభవం వస్తాయి. ముఖ్యంగా దప్పళంలోకి మరీ మరీ బాగుంటాయి. మీ కోసం వడియాల్లో కొన్ని వెరైటీలు..



## జొన్నలతో..

**కావలసినవి:**
జొన్నపిండి 2 కప్పులు,
బియ్యప్పిండి అర కప్పు,
పచ్చిమిర్చి ముక్కలు 2 టేబుల్ స్పూన్లు,
జీలకర్ర స్పూన్,
నువ్వులు టేబుల్ స్పూన్,
ఉప్పు రుచికి తగినంత,
వెల్లుల్లి ముద్ద ఒకటిన్నర స్పూన్లు,
కరివేపాకు,
కొత్తిమీర తరుగు రెండు టేబుల్ స్పూన్ల చొప్పున

**తయారీ:**
ఒక పెద్ద గిన్నెలో 4 కప్పుల నీళ్లు పోసి మరిగించాలి. అందులో ఉప్పు, జీలకర్ర, నువ్వులు, పచ్చిమిర్చి ముక్కలు, వెల్లుల్లి ముద్ద, కరివేపాకు, కొత్తిమీర వేసి బాగా కలపాలి. నీళ్లు తెర్లుతున్నప్పుడు సెగ తగ్గించి జొన్నపిండి, బియ్యప్పిండి నెమ్మదిగా వేస్తూ ఉండలు కట్టకుండా కలపాలి. మధ్యమధ్యలో కలియబెడుతూ ఉడికించి.. చిక్కగా అయ్యాక దించేయాలి. కొద్దిగా చల్లారాక.. శుభ్రమైన వస్త్రం లేదా పాలిథిన్ పేపర్ మీద వడియాలు పెట్టాలి. వీటిని రెండు మూడు రోజులు ఎండబెట్టాలి. బాగా ఎండిన తర్వాత గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేసుకుంటే రుచికరమైన వడియాలు సిద్ధం. దప్పళంలోకి గుప్పెడు వడియాలుంటే ఆ రుచే వేరు.



## రాగులతో..

**కావలసినవి:**
రాగిపిండి రెండు కప్పులు,
సగ్గుబియ్యం కప్పు,
పచ్చిమిర్చి ముక్కలు మూడు టేబుల్ స్పూన్లు,
జీలకర్ర,
వెల్లుల్లి ముద్ద స్పూన్ చొప్పున,
నువ్వులు నాలుగు టేబుల్ స్పూన్లు,
ఉప్పు తగినంత

**తయారీ:**
సగ్గుబియ్యాన్ని 2 గంటలు నానబెట్టి.. ఆ నీళ్లు వంపేసి పక్కనుంచాలి. ఐదు కప్పుల నీళ్లలో ఉప్పు, జీలకర్ర, నువ్వులు, పచ్చిమిర్చి ముక్కలు, వెల్లుల్లి ముద్ద వేసి మరిగించాలి. నీళ్లు తెర్లుతుండగా.. సగ్గుబియ్యం జత చేయాలి. ఐదు నిమిషాల తర్వాత రాగిపిండిలో కొన్ని నీళ్లు పోసి ఉండలు కట్టకుండా కలిపి.. ఉడుకుతున్న సగ్గుబియ్యంలో చేర్చాలి. పిండి చక్కగా ఉడికి చిక్కబడ్డాక దించేయాలి. ఈ మిశ్రమంతో వడియాలు పెట్టాలి. రెండు మూడు రోజులు ఎండిన తర్వాత.. గాలి చొరబడని డబ్బాలో భద్రం చేసుకోవాలి. ఇవి కూరల్లోకే కాదు.. చిరుతిండిగానూ బాగుంటాయి.



## అన్ని పప్పులతో..

**కావలసినవి:**
మినప్పప్పు ఒక కప్పు,
బియ్యం,
శనగ,
పెసరపప్పులు అర కప్పు చొప్పున,
ఉప్పు రుచికి తగినంత,
అల్లం అంగుళం ముక్క,
పచ్చిమిర్చి ఆరేడు,
జీలకర్ర స్పూన్,
మిరియాలు అర స్పూన్,
వాము పావు స్పూన్

**తయారీ:**
బియ్యం, మినప, శనగ, పెసరపప్పులను నాలుగు గంటలు నానబెట్టాలి. తర్వాత నీళ్లు వంపేసి పచ్చిమిర్చి, అల్లం, మిరియాలు వేసి కొంచెం బరకగా ఉండేలా గ్రైండ్ చేయాలి. అందులో జీలకర్ర, ఉప్పు జతచేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో వడియాలు పెట్టాలి. బాగా ఎండిన తర్వాత గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేసుకోవాలి. ఇవి అన్నంలోకే కాదు.. సాయంత్రం చిరుతిండిగానూ బాగుంటాయి.



## బంగాళదుంపలతో..

**కావలసినవి:**
బంగాళదుంపలు అర కిలో,
సగ్గుబియ్యం కప్పు,
పచ్చిమిర్చి 6,
జీలకర్ర స్పూన్,
నువ్వులు రెండు టేబుల్ స్పూన్లు,
ఉప్పు తగినంత,
అల్లం ముద్ద ఒకటిన్నర స్పూన్లు,
కరివేపాకు తరుగు చారెడు

**తయారీ:**
సగ్గుబియ్యాన్ని 3 గంటలు నానబెట్టాలి. అల్లం, పచ్చిమిర్చిలను నూరి ఉంచాలి. నువ్వులను వేయించాలి. బంగాళదుంపలను ఉడికించి పొట్టు తీసి మెత్తగా మెదపాలి. వెడల్పాటి గిన్నెలో నీళ్లు మరిగించాలి. అందులో ఉప్పు, జీలకర్ర, నానబెట్టిన సగ్గుబియ్యం జతచేయాలి. అది మెత్తగా ఉడికాక.. కరివేపాకు తరుగు, అల్లం పచ్చిమిర్చి, బంగాళదుంపల ముద్ద, నువ్వులు చేర్చి కలుపుతుండాలి. మిశ్రమం కొద్దిగా గట్టిగా అయ్యాక సెగ తీసేయాలి. దీంతో వడియాలు పెట్టి, 3 రోజులు ఎండనివ్వాలి. పూర్తిగా ఎండిన తర్వాత గాలి చొరబడని సీసాలో భద్రం చేయాలి. ఈ ఆలూ వడియాలు చారులో నంజుకోవడానికే కాదు.. చిప్స్‌లానూ తినొచ్చు.



## అటుకులతో..

**కావలసినవి:**
మినప్పప్పు,
అటుకులు కప్పు చొప్పున,
బియ్యప్పిండి,
శనగపప్పు అర కప్పు చొప్పున,
ఉప్పు రుచికి తగినంత,
పచ్చిమిర్చి 6,
అల్లం అంగుళం ముక్క,
జీలకర్ర స్పూన్,
నువ్వులు 2 టేబుల్ స్పూన్లు


**తయారీ:**
మినప, శనగపప్పులను నాలుగు గంటలు నానబెట్టాలి. ఆ నీళ్లు వంపేసి పచ్చిమిర్చి, అల్లం వేసి మరీ మెత్తగా కాకుండా గ్రైండ్ చేయాలి. ఈ పిండిలో నానబెట్టిన అటుకులు, బియ్యప్పిండి, జీలకర్ర, నువ్వులు, ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో శుభ్రమైన వస్త్రం లేదా ప్లాస్టిక్ షీట్ మీద వడియాలు పెట్టాలి. వీటిని మూడు రోజులు ఎండబెడితే పాడవకుండా ఉంటాయి.



## కరివేపాకు వడియాలు

**కావలసినవి:**
బియ్యం 2 కప్పులు,
కరివేపాకు,
సగ్గుబియ్యం కప్పు చొప్పున,
పచ్చిమిర్చి 8,
జీలకర్ర స్పూన్,
నువ్వులు 3 టేబుల్ స్పూన్లు,
వెల్లుల్లి ముద్ద ముప్పావు స్పూన్,
ఉప్పు తగినంత,
నీళ్లు 6 కప్పులు

**తయారీ:**
బియ్యాన్ని, సగ్గుబియ్యాన్ని విడివిడిగా నానబెట్టాలి. నాలుగు గంటల తర్వాత బియ్యంలో నీళ్లు వంపేసి మెత్తగా రుబ్బాలి. పచ్చిమిర్చి, వెల్లుల్లి, కరివేపాకులను గ్రైండ్ చేసుకోవాలి. నువ్వులను వేయించాలి. ఒక పెద్ద గిన్నెలో నీళ్లు మరిగించాలి. అందులో ఉప్పు, జీలకర్ర, నువ్వులు వేసి కలపాలి. ఇప్పుడు నానబెట్టిన సగ్గుబియ్యం చేర్చాలి. అది ఉడికాక.. బియ్యప్పిండి జతచేయాలి. ఈ మిశ్రమంతో వడియాలు పెట్టాలి. బాగా ఎండిన తర్వాత గాలి చొరబడని సీసాలోకి తీసుకోవాలి. ఈ కరివేపాకు వడియాలు రుచే కాదు ఆరోగ్యం కూడా.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7231/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com